విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :15 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 9 జూన్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




# ఉక్కులో ఉపద్రవం

- విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఘోర ప్రమాదం
- భారీ పేలుడుతో ఎగసిపడిన 150 టన్నుల ఉక్కు ద్రావణం
- 8 మంది కార్మికుల దుర్మరణం
- మరో ఆరుగురికి తీవ్ర గాయాలు
- 1,540 డిగ్రీల వేడితో ఉన్న ద్రవ ఉక్కు పడటంతో బొగ్గుల్లా మారిన మృతదేహాలు



అన్నం పెట్టే పనే.. వారికి మృత్యుపాశమైంది. ఉక్కు తయారీలో ఆరితేరిన ఆ చేతులు.. అదే ఉక్కు ధాటికి అచేతనమైపోయాయి. నిప్పుల కొలిమిలాంటి పనిలో నిపుణులైన ఆ శ్రామికులు సలసల మరిగే ద్రావణం పడి విగత జీవులైపోయారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులమని గర్వంగా చెప్పుకొనే ఆ శ్రామికులు ఇప్పుడు అదే స్టీల్‌కు ఆహుతైపోయారు..

వివరాలు 2లో..

## భూ రికార్డుల్లో అక్రమాలను

# ప్రక్షాళన చేస్తున్నాం

- గత ప్రభుత్వంలో భూసర్వేలో అవకతవకలు చేశారు
- విధ్వంస పాలన పరిణామాలేంటో గత ప్రభుత్వంలో చూశామన్న సీఎం చంద్రబాబు
- భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది
- బ్లాక్ చైన్ టెక్నాలజీ ద్వారా భూములను సర్వే చేశాం
- రాష్ట్రానికి పెట్టుబడులు పెరిగిపోతున్నాయి
- 20 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి



**అమరావతి**

ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం భూ రికార్డుల్లో అక్రమాలను ప్రక్షాళన చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ లో భూముల సమస్యలు తక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ఏపీని బ్రిటీష్ వాళ్లు పాలించారు కాబట్టే ఇవి తక్కువగా ఉన్నాయని, తెలంగాణలోని నిజాం పాలనలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు చెప్పారు. నిజాం పాలనలో చాలామందికి ల్యాండ్స్ రిజిస్ట్రేషన్లు చేసేవారని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ నియోజకవర్గ పరిధిలోని సిద్ధాంతంలో ఏర్పాటు చేసిన 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రబాబు రైతులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన పాసు పుస్తకాలను అందజేశారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని చంద్రబాబు

వివరాలు 2లో..



## జూలైలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం

- కేంద్రమంత్రి పీయూష్ గోయెల్
- గత కొన్ని వారాలుగా ఇరుదేశాల ఉన్నతాధికారుల మధ్య చర్చలు ఊపందుకున్నాయి
- అందరూ ఊహించిన దానికంటే ముందే ఒక మంచి నిర్ణయం వెలువడే అవకాశం ఉంది
- ప్రస్తుతం చర్చలు సానుకూలంగా సాగుతున్నప్పటికీ కొన్ని సవాళ్లు ఇంకా ఎదురవుతూనే ఉన్నాయి

## సంక్షోభం వల్లే ఎల్‌పీజీ ధరల పెంపు అనివార్యమైంది

- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి
- ఇటీవలే పెరిగిన గృహ వినియోగ వంట గ్యాస్ (ఎల్‌పీజీ) ధర
- ఈ పెంపుపై కేంద్ర ప్రభుత్వం కూడా బాధపడుతోందన్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



# గొడ్డలి పార్టీ రాష్ట్రానికి చేటు




- కూటమి సర్కారే మళ్లీ మళ్లీ రావాలి
- నంద్యాలలో 'ప్రజా పాలనకు రెండేళ్లు' విజయోత్సవ సభ
- రాయలసీమలోని ప్రతి సాగునీటి ప్రాజెక్టునూ పూర్తి చేస్తామని పయ్యావుల వెల్లడి
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి

**అమరావతి**

ఏపీలో కూటమి ప్రభుత్వం అద్భుతమైన ప్రగతి సాధిస్తోందని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఉద్ఘాటించారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం రాష్ట్రానికి, సమాజానికి హానికరమని ఆయన విమర్శించారు. "గొడ్డలి పార్టీ నెవర్ ఎగైన్, కూటమి పార్టీ అగైన్ అండ్ అగైన్" అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. నంద్యాల వేదికగా జరిగిన 'ప్రజా పాలనకు రెండేళ్లు' కార్యక్రమంలో

వివరాలు 2లో..



## 'ఐక్యతతో డీలిమిటేషన్ బిల్లును ఓడించాం

- ఇకపై అదే పోరాటాన్ని కొనసాగించాలి'
- ఇండియా కూటమి మీటింగ్‌లో ఖర్గే
- ఇండి కూటమి సమావేశం
- ప్రారంభోన్యాసం ఖర్గే కీలక వ్యాఖ్యలు
- కేంద్ర ప్రభుత్వంపై మండిపాటు

## ఆంధ్రా పేపర్ మిల్స్‌కు షోకాజ్

# నోటీసులివ్వండి




- అధికారులకు పవన్ ఆదేశం
- గోదావరి నది కాలుష్యంపై సమీక్ష నిర్వహించిన పవన్
- నిర్దేశిత పరిమాణం కంటే ఎక్కువ రసాయనాలు కలుస్తున్నాయని నివేదికలో వెల్లడి
- ఆంధ్రా పేపర్ మిల్స్‌కు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని ఆదేశించిన పవన్

**అమరావతి**

గోదావరిలో కాలుష్యాన్ని వదులుతున్న అంధ్రా పేపర్ మిల్స్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. ఇటీవల రాజమహేంద్రవరంలో గోదావరి నది కాలుష్యాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాడు సేకరించిన నమూనాలను ప్రయోగశాలలో పరీక్షించిన అనంతరం వచ్చిన నివేదికలన పవన్ పరిశీలించారు. ఆపై ఈ నివేదికలపై రాజమహేంద్రవరం జిల్లా అధికారులతో వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత పరిమాణం కంటే భారీ స్థాయిలో ప్రమాదకర రసాయనాలు గోదావరిలో కలుస్తున్నట్లు నివేదికలో తేలిందన్నారు. ఇంత జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నెలకు ఒకసారి నమూనాలు సేకరిస్తున్నట్లు అధికారులు బదులు ఇచ్చారు. మరి అలాంటప్పుడు ఇంత కలుషితమవుతుంటే చర్యలు ఎందుకు తీసుకోలేదని పవన్ అధికారులను అడిగారు. ఏం చేస్తున్నారు?: అంతేకాకుండా వెంటనే ఆంధ్ర పేపర్ మిల్స్

వివరాలు 2లో..



## ఇరాన్, ఇజ్రాయెల్ ఘర్షణపై భారత్ ఆందోళన

# రైతులకు ఎరువుల పంపిణీ వేగంగా చేయండి

- కౌలు రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలి
- కృత్రిమ కొరత, మళ్లింపులను అరికట్టేందుకు విజిలెన్స్ బృందాలు ఏర్పాటు చేయాలి
- జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, వ్యవసాయ అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి**

రాష్ట్రంలో ఎరువుల పంపిణీని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు రూపొందించిన ఏపీఎఐఎంఎస్ 2.0 వ్యవస్థను విజయవంతంగా అమలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను

వివరాలు 2లో..



# ఉక్కులో ఉపద్రవం

: విశాఖ ఉక్కు కర్మాగారంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. సలసల మరుగుతున్న ఉక్కు ద్రవం లావాలా ఎగసి కార్మికులపై పడటంతో 8 మంది మృతి చెందారు. మరో ఆరుగురు ఒళ్లంతా కాలిపోయి కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నారు. సోమవారం సాయంత్రం ఉక్కు కర్మాగారంలోని స్టీల్ మెల్ట్ షాప్ (ఎస్ఎంఎస్)-1లో ఈ ఘోర దుర్ఘటన సంభవించింది. సాయంత్రం ఎస్ఎంఎస్-1లో పనిచేయడానికి కార్మికులు వెళ్లగా ఊహకందని విధంగా లాడిల్ భారీ శబ్దంతో ఒక్కసారిగా పేలిపోయింది. 1,540 డిగ్రీలకు పైగా వేడితో ఉన్న సుమారు 150 టన్నుల ద్రవపు ఉక్కు ఒక్కసారిగా మీద పడటంతో కార్మికులు తప్పించుకోలేక పోయారు. ఊహించడానికే వీల్లేనంత వేడి ద్రావణం ధాటికి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.



ప్రమాదం జరిగిన ఎస్ఎంఎస్1 విభాగంలో మంటలను అదుపు చేస్తున్న సీఐఎస్ఎఫ్ అగ్నిమాపక సిబ్బంది

**ఎక్కడివాళ్లు అక్కడే కరిగిపోయి..**

కర్మాగారం స్టీల్‌మెల్ట్ షాప్-1లో బ్లాస్ట్ ఫర్నేస్ నుంచి టర్బో లాడిల్ ద్వారా కన్వర్టర్‌కు ద్రవ ఉక్కు చేరవేస్తారు. మిశ్రమాలు కలిపిన తర్వాత అక్కడ నుంచి లాడిల్ ద్వారా క్యాస్టింగ్ మిషన్‌లకు చేరుస్తారు. ఈ విభాగంలో మొత్తం ఆరు క్యాస్టింగ్ మిషన్లు (స్టాండ్స్) ఉంటాయి. ద్రవ ఉక్కును కంటిన్యూ క్యాస్టింగ్ డిపార్ట్‌మెంట్ (సీసీడీ)లోని మెషీన్లలో పోసి బ్లూమ్స్‌గా చేస్తారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం 4.20 గంటలకు కన్వర్టర్ నుంచి బయలుదేరిన లాడిల్-19 క్యాస్టింగ్ మిషన్-2లో పోసేందుకు అనుమతించారు. ఈ సమయంలో ఒక్కసారిగా లాడిల్ పేలిపోయింది. దీంతో 1,540 డిగ్రీల సెల్సియస్ వేడితో ఉన్న ఉక్కు ద్రవం ఎగసిపడి భారీగా మంటలు వ్యాపించాయి. అక్కడ విధుల్లో సుమారు 14 మంది ఒప్పంద, శాశ్వత కార్మికులు పనిచేస్తున్నారు. వారిలో 8 మందిపై ఉక్కు ద్రవం పడి ఎక్కడ నిల్చున్నవారు అక్కడే కాలిపోయారు. మరో ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారికి తొలుత ఉక్కు ఆసుపత్రిలో చికిత్స చేసి, మెరుగైన సేవల కోసం విశాఖ నగరంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఉక్కు సీఐఎస్ఎఫ్ ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని ఆరు అగ్నిమాపక యంత్రాలతో నాలుగు గంటలపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. ఉక్కు యాజమాన్యం నష్టపరిహారం ప్రకటిస్తుందని ఆర్ఐఎన్ఎల్ ప్రతినిధులు వినయ్‌కుమార్, రాధిక, భాను (హెచ్ఆర్‌లు) తెలిపారు. అయితే మృతుల కుటుంబాలు, కార్మిక, ఉద్యోగ సంఘాలు మృతదేహాలను పోస్టుమార్టమ్‌కు తరలించడానికి అంగీకరించలేదు. యాజమాన్యం వచ్చి పరిహారం ప్రకటించే వరకు ఉక్కు జనరల్ ఆసుపత్రి మార్చురీ నుంచి మృతదేహాలను తీసుకెళ్లనివ్వబోమంటూ అంబులెన్స్‌లను అడ్డుకున్నారు.

**హోం మంత్రి పరిశీలన**

హోం మంత్రి వంగలపూడి అనిత, విశాఖ ఎంపీ శ్రీభరత్, విశాఖ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఘటనాస్థలిని పరిశీలించి ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు.

పైడిరాజు, బలువ, పి.శ్రీనివాస్, అప్పారావు, మల్లికార్జున (క్రేన్ ఆపరేటర్). వీరంతా ఉక్కు ఉద్యోగులే. గాజువాక సీతానగరానికి చెందిన ఒప్పంద కార్మికుడు సూరిబాబు కూడా తీవ్రగాయాలపాలయ్యారు.

**చంద్రబాబు సమీక్ష**

విశాఖ ఉక్కు కర్మాగారంలో జరిగిన ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే సమీక్షించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఉన్నతాధికారులు, విశాఖ జిల్లా కలెక్టర్ తదితరులు సమీక్షలో పాల్గొన్నారు. ప్రమాద కారణాలు, క్షతగాత్రులకు అందుతున్న వైద్య సేవలు, కర్మాగారంలో ప్రస్తుత పరిస్థితిని సీఎంకు విశాఖ కలెక్టర్ వివరించారు. మృతుల్లో ఐదుగురు శాశ్వత ఉద్యోగులు, ముగ్గురు ఒప్పంద ఉద్యోగుల్ని గుర్తించామన్నారు. ఆరుగురు క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు.

# సంక్షోభం వల్లే ఎల్‌పీజీ ధరల పెంపు అనివార్యమైంది

ప్రపంచ సంక్షోభం కారణంగా ఎల్‌పీజీ ధరల పెంపు అనివార్యంగా మారిందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. గ్యాస్ సిలిండర్ ధరల పెంపు పట్ల కేంద్రం కూడా బాధపడుతోందని, అలాగే విచారం వ్యక్తం చేస్తోందని పేర్కొన్నారు. ఇంధన రవాణా సజావుగా సాగకపోవడం, చాలా పరిమిత వనరుల నుంచే ఎల్‌పీజీ లభించడం వంటి సమస్యలు ఉన్నాయని వెల్లడించారు. కర్ణాటకలోని ధార్వాడ్‌లో విలేకరులతో జరిగిన సంభాషణలో ప్రహ్లాద్ జోషి ఈ మేరకు వ్యాఖ్యానించారు.



**'ప్రపంచం తీవ్రమైన సంక్షోభాలతో సతమతమవుతోంది'**

"గ్యాస్ సిలిండర్ ధరల పెంపు పట్ల మేము కూడా చాలా బాధపడుతున్నాం, విచారం వ్యక్తం చేస్తున్నాం. కానీ మమ్మల్ని విమర్శించే ముందు ప్రతి ఒక్కరూ ప్రపంచవ్యాప్త పరిస్థితులను అర్థం చేసుకోవాలి. ప్రపంచం తీవ్రమైన సంక్షోభాల మధ్య సతమతమవుతోంది. రవాణా సజావుగా సాగకపోవడం, చాలా పరిమిత వనరుల నుంచే ఎల్‌పీజీ లభించడం వంటి సమస్యలు ఉన్నాయి. ఎల్‌పీజీ, పెట్రోల్/డీజిల్ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం సేకరణ వనరులను పెంచడానికి ప్రయత్నిస్తోంది. భారత్‌కు చాలా దూరంలో ఉన్న దేశాల నుంచి కూడా గ్యాస్, ఇంధన సేకరణ జరుగుతోంది. రవాణా ఖర్చులు ఎక్కువగా ఉన్నాయి. మూల ధర కూడా అధికంగా ఉంది. అలాగే 40-45 రోజుల రవాణా సమయం కారణంగా బీమా ఖర్చులు కూడా పెరిగాయి. కాబట్టి సామాన్యుల గురించి మాకూ ఆందోళన ఉంది. కానీ అదే సమయంలో గ్యాస్ ధరల పెంపు అనివార్యంగా మారింది. "

**అధికార పార్టీలో తీవ్ర అసంతృప్తి : ప్రహ్లాద్ జోషి**

అలాగే కన్నడనాట రాజకీయాలపై కూడా ప్రహ్లాద్ జోషి కీలక వ్యాఖ్యలు చేశారు. కర్ణాటకలోని అధికార కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, బంధుప్రీతి, వర్గపోరుతో సతమతమవుతోందని ఆరోపించారు. అధికార పార్టీలో అంతర్గత అసంతృప్తి స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఒక మంత్రి రాజీనామా చేశారని, మరికొందరు బహిరంగంగానే తమ అసంతృప్తిని వ్యక్తం చేశారని గుర్తుచేశారు. డీకే సర్కార్ పాలన అంత సవ్యంగా లేదని ఈ పరిస్థితులే స్పష్టం చేస్తున్నాయని అన్నారు.

**పెరిగిన గ్యాస్ ధర**

ప్రపంచవ్యాప్తంగా ఇంధన వ్యయాలు పెరిగి ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో గృహ వినియోగ వంట గ్యాస్ (ఎల్‌పీజీ) ధర సిలిండర్‌కు రూ. 29 మేర పెంచింది కేంద్ర ప్రభుత్వం. గత మూడు నెలల్లో ఎల్‌పీజీ ధర పెరగడం ఇది రెండోసారి. పశ్చిమాసియాలో ఘర్షణల కారణంగా ఇంధన సరఫరాకు అంతరాయం కలిగి అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరిగిన నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 7న సిలిండర్‌పై రూ. 60 పెంచింది. మళ్లీ జూన్ 7న గ్యాస్ సిలిండర్ రేటును పెంచుతూ కేంద్ర సర్కార్ నిర్ణయం తీసుకుంది. తాజా రేటు పెంపునకు ముందు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు విక్రయించే ప్రతి ఎల్‌పీజీ సిలిండర్‌పై సుమారు రూ. 703 నష్టాన్ని చవిచూస్తున్నట్లు అంచనా.


**గ్యాస్ రేటు పెంపును సమర్థించుకున్న కేంద్రం**

కాగా, వంట గ్యాస్ ధరల పెంపును సమర్థించుకుంటూ కేంద్రం కీలక ప్రకటన చేసింది. పశ్చిమాసియాలో అవాంతరాల తర్వాత ఎల్‌పీజీ ధర గణనీయంగా పెరిగినా ప్రపంచంలో అతి తక్కువ ధర మన దేశంలోనే ఉందని వెల్లడించింది. ఇళ్లకు వంటగ్యాస్ సిలిండర్ సరఫరాకు రూ.1,600కుపైగా ఖర్చవుతోందని పేర్కొంది. సౌదీ కాంట్రాక్ట్ ప్రైస్‌తో ముడిపడి ఇది మారుతుంటుందని వెల్లడించింది. హర్మూజ్ జలసంధి వద్ద ఏర్పడిన అంతరాయాల వల్ల గల్ఫ్ ప్రాంతం నుంచి సరఫరా తగ్గడంతో ఫిబ్రవరి నుంచి గ్యాస్ ఈ ప్రామాణిక ధర సుమారు 46 శాతం పెరిగిందని చెప్పింది. అయినప్పటికీ పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి పొరుగు దేశాల కంటే తక్కువ ధరకే భారత్‌లో వంట గ్యాస్ దొరుకుతోందని స్పష్టం చేసింది.

# ఇరాన్, ఇజ్రాయెల్ ఘర్షణపై భారత్ ఆందోళన

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పశ్చిమాసియా ప్రాంతం మరోసారి అశాంతి దిశగా సాగుతోంది. పరస్పర దాడులు, క్షిపణి దాడులతో పరిస్థితి ఆందోళనకరంగా మారిన నేపథ్యంలో భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వెంటనే ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని, శాంతి స్థాపన కోసం జరుగుతున్న దౌత్య చర్చలను త్వరితగతిన పూర్తి చేయాలని అన్ని పక్షాలకు పిలుపునిచ్చింది. పశ్చిమాసియాలో తిరిగి దాడులు ప్రారంభం కావడం అంతర్జాతీయ సమాజానికి తీవ్ర ఆందోళన కలిగిస్తున్న విషయమని భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఇప్పటికే 100 రోజులకు పైగా కొనసాగుతున్న ఈ ఘర్షణలు భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని కలిగించాయని తెలిపింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో పాటు ఇంధన సరఫరాలపై కూడా ఈ యుద్ధ ప్రభావం తీవ్రంగా పడుతోందని ఆందోళన వ్యక్తం చేసింది.

"పశ్చిమాసియాలో మళ్లీ దాడులు ప్రారంభం కావడం పట్ల భారత్ తీవ్ర విచారం వ్యక్తం చేస్తోంది. ఈ పరిణామాలు ప్రపంచ దేశాలన్నింటికీ ఆందోళన కలిగిస్తున్నాయి. 100 రోజులకు పైగా కొనసాగుతున్న ఈ ఘర్షణల వల్ల మానవతా సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఇంధన సరఫరాలపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోంది" అని విదేశాంగ శాఖ పేర్కొంది. అన్ని పక్షాలు వెంటనే ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని, పౌరులకు ఎలాంటి హాని జరగకుండా చర్యలు తీసుకోవాలని భారత్ సూచించింది. ప్రస్తుతం కొనసాగుతున్న దౌత్య చర్చలను త్వరగా ముగించి శాంతి, స్థిరత్వం పునరుద్ధరించే దిశగా ముందుకు సాగాలని కోరింది.




ఇటీవల జరిగిన పరిణామాల్లో ఇజ్రాయెల్ పశ్చిమ, మధ్య ఇరాన్ ప్రాంతాల్లో వైమానిక దాడులు నిర్వహించింది. దీనికి ప్రతిస్పందనగా ఇరాన్ ఉత్తర ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడులు చేపట్టినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. దీంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఏప్రిల్‌లో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత ఇదే అతిపెద్ద ఉద్రిక్తతగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గత 24 గంటల్లో పలు నగరాలపై దాడులు, కీలక స్థావరాలపై వైమానిక దాడులు, భారీ స్థాయిలో క్షిపణుల ప్రయోగం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. దీంతో ప్రాంతీయ భద్రతపై ఆందోళనలు మరింత పెరిగాయి.

ఇక ఎర్ర సముద్రం ప్రాంతంలో పరిస్థితులు కూడా ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఇరాన్ మద్దతు ఉన్న హౌతీ తిరుగుబాటుదారులు ఇజ్రాయెల్‌కు చెందిన నౌకల రాకపోకలను నిషేధిస్తున్నట్లు ప్రకటించినట్లు అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన సముద్ర మార్గాల్లో ఇది కొత్త సవాళ్లను సృష్టించే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఇరాన్, ఇజ్రాయెల్ దేశాలు పరస్పర దాడులను నిలిపివేయాలని కోరినట్లు సమాచారం. రెండు దేశాలు సంయమనం పాటించి పరిస్థితిని మరింత ఉద్రిక్తం కాకుండా చూడాలని ఆయన సూచించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

ఫిబ్రవరి చివర్లో ప్రారంభమైన ఈ ఘర్షణ ఇప్పటివరకు ముగిసే సూచనలు కనిపించకపోవడం ప్రపంచ దేశాలను కలవరపెడుతోంది. ముఖ్యంగా ఇంధన ఉత్పత్తి, సరఫరాలపై ప్రభావం పడటం వల్ల చమురు ధరలు పెరిగే అవకాశాలపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా ప్రాంతీయ భద్రత, వాణిజ్య మార్గాల రక్షణ, ప్రపంచ ఆర్థిక స్థిరత్వంపై కూడా ఈ యుద్ధం ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో శాంతియుత పరిష్కారమే ఏకైక మార్గమని భారత్ మరోసారి స్పష్టం చేసింది. యుద్ధం కంటే దౌత్య చర్చల ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొంటూ, అన్ని పక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరింది. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం పునరుద్ధరణ కోసం జరుగుతున్న చర్చలు విజయవంతం కావాలని ఆకాంక్షించింది.

## జూలైలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం



సుదీర్ఘకాలంగా చర్చల దశలో ఉన్న భారత్-అమెరికా ప్రతిష్ఠాత్మక వాణిజ్య ఒప్పందం తుదిదశకు చేరుకుంది. వచ్చే జూలైలో ఈ ఒప్పందానికి సంబంధించిన మొదటి విడత ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. ఇటీవలి కాలంలో పన్నుల విషయంలో ఇరుదేశాల మధ్య స్వల్ప వివాదం తలెత్తినప్పటికీ చర్చలు మాత్రం వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించుకుంటూ.. పరస్పర మార్కెట్ భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవడమే ఈ ద్వైపాక్షిక ఒప్పందం ముఖ్య ఉద్దేశమని గోయల్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల భారతీయ ఎగుమతిదారులకు అమెరికా మార్కెట్‌లో భారీ ప్రయోజనం చేకూరనుంది. గత కొన్ని వారాలుగా ఇరుదేశాల ఉన్నతాధికారుల మధ్య చర్చలు ఊపందుకున్నాయని, అందరూ ఊహించిన దానికంటే ముందే ఒక మంచి నిర్ణయం వెలువడే అవకాశం ఉందని ధీమా వ్యక్తంచేశారు. అంతకుముందు జూన్ 5న ఢిల్లీలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో అమెరికా వాణిజ్య విభాగానికి చెందిన పూర్తిస్థాయి బృందం పాల్గొందని గోయల్ గుర్తుచేశారు. ఆ భేటీలోనే ఒప్పందానికి అడ్డంకిగా ఉన్న చాలా అంశాలపై ఒక స్పష్టత వచ్చిందన్నారు. జూలై మధ్య నాటికి ఇరుదేశాల ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేసేలా మొదటి విడత ఒప్పందాన్ని అమలుచేసే స్థితికి చేరుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. నిజానికి ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఈ వాణిజ్య ఒప్పందంపై ఇరుదేశాల మధ్య ఒక ప్రాథమిక అవగాహన కుదిరింది. కానీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన కొన్ని పన్నుల నిర్ణయాలపై చట్టపరమైన సవాళ్లు ఎదురుకావడంతో చర్చలు కాస్త నెమ్మదించాయి. ఇటీవల ఢిల్లీలో జరిగిన అధికారుల భేటీ తర్వాతే మళ్లీ ఈ ప్రక్రియ వేగం పుంజుకుంది. ప్రస్తుతం చర్చలు సానుకూలంగా సాగుతున్నప్పటికీ కొన్ని సవాళ్లు ఇంకా ఎదురవుతూనే ఉన్నాయి. భారత్ నుంచి వచ్చే దిగుమతులపై అదనంగా 12.5 శాతం పన్ను విధించాలని అమెరికా గత వారమే ఓ ప్రతిపాదన తెచ్చింది. నిర్బంధ శ్రమ ద్వారా తయారయ్యే వస్తువుల దిగుమతులను అడ్డుకోవడంలో భారత్ తగిన చర్యలు తీసుకోలేదనే నెపంతో ఈ ప్రతిపాదన చేశారు. అయినప్పటికీ వాణిజ్య బంధాన్ని దెబ్బతీసుకోవద్దనే ఉద్దేశంతో ఇరుదేశాలు చర్చలను నిరంతరం కొనసాగిస్తున్నాయి. అమెరికా ప్రస్తుతం భారతదేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వాములలో ఒకటిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా వ్యవస్థలను సురక్షితం చేసుకోవడానికి దేశాలు ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ ఒప్పందం భారత్‌కు ఎంతో కీలకం కానుంది. మంత్రి పీయూష్ గోయల్ చెప్పిన టైమ్‌లైన్ ప్రకారం అన్నీ సజావుగా సాగితే జూలై మధ్యకల్లా ఇరుదేశాల మధ్య సరికొత్త ఆర్థిక అధ్యాయం మొదలవుతుంది.

## అంగీకారంతో కూడిన శారీరక సంబంధం చెడు ప్రవర్తనకు సంకేతం కాదు



మేజర్ల విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. పెళ్లి కాని ఇద్దరు వయోజనులు పరస్పర అంగీకారంతో శారీరక సంబంధాన్ని కలిగి ఉండడాన్ని చెడు ప్రవర్తనగా భావించకూడదని స్పష్టం చేసింది. ప్రేమ విషయంలో నమోదైన ఒక క్రిమినల్ కేసును విచారించిన జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. అలాగే కేసులో తెలంగాణ పోలీస్ నియామక మండలికి కీలక ఆదేశాలు జారీ చేసింది. నియామక ప్రక్రియలో పరిగణించి ఉద్యోగం ఇవ్వాలని ఆదేశించింది. కేసు వివరాల ప్రకారం, పిటిషన్ దారుడు తన పొరుగింటి యువతితో కొన్నేళ్ల పాటు ప్రేమ సంబంధం కొనసాగించాడు. ఇద్దరి మధ్య ఉన్న ఆ సంబంధం తర్వాత వివాహ సంబంధంగా మారలేదు. దీంతో 2014లో వివాహం చేసుకుంటానని హామీ ఇచ్చి మోసం చేశాడంటూ అతడిపై కేసు నమోదైంది. అయితే తర్వాత ఇరువురు పరస్పర అంగీకారంతో రాజీకి వచ్చారు. 2015లో లోక్ అదాలత్‌లో ఆ వివాదం పరిష్కారమైంది. కేసును కొనసాగించేందుకు యువతి ఆసక్తి చూపలేదు. దీంతో వ్యవహారం అక్కడితో ముగిసింది. అయినప్పటికీ, ఆ కేసు నేపథ్యంలో అతడిపై నైతిక అపరాధం (మోరల్ టర్పిట్యూడ్) ముద్ర పడిందని భావించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక బోర్డు నియామకాన్ని రద్దు చేసింది. దీనిని సవాలు చేస్తూ అభ్యర్థి న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి అతడి వాదనను సమర్థిస్తూ నియామకాన్ని మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. ఆ తీర్పును సవాలు చేస్తూ అధికారులు అప్పీల్‌కు వెళ్లగా, చివరకు సుప్రీంకోర్టు కూడా అభ్యర్థికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది.

**వివాహంతోనే ప్రేమ ముగియాలనే నియమం లేదు!**

ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రతి ప్రేమ సంబంధం వివాహంతోనే ముగియాలనే నియమం లేదని పేర్కొంది. కేవలం వివాహం జరగలేదనే కారణంతో ఒక వ్యక్తి మరొకరిని మోసం చేశాడని తేల్చేయడం సరికాదని స్పష్టం చేసింది. సంబంధం విఫలమైందంటే అది తప్పనిసరిగా మోసమే అని భావించలేమని పేర్కొంది. అదేవిధంగా, సంబంధంలో బెదిరింపులు లేదా ఒత్తిడి ఉన్నట్లు ఆధారాలు ఉంటే నియామక సంస్థలు అభ్యర్థి అర్హతపై సందేహాలు వ్యక్తం చేయవచ్చని ధర్మాసనం తెలిపింది. అయితే ప్రస్తుత కేసులో అలాంటి పరిస్థితులు ఏవీ కనిపించలేదని పేర్కొంది. యువతితో బలవంతంగా రాజీ ఒప్పందం చేసుకున్నట్లు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది.

**చట్టపరమైన పరిమితుల్లోనే!**

క్రిమినల్ న్యాయ వ్యవస్థలో ఒక వ్యక్తిపై ఆరోపణలు నిరూపితమయ్యే వరకు అతడిని నిర్దోషిగానే పరిగణిస్తామని సుప్రీంకోర్టు గుర్తు చేసింది. ఆరోపణలు ఉన్నాయనే కారణంతోనే అతడిని దోషిగా చూడలేమని తెలిపింది. ముఖ్యంగా మోసం జరిగిందా లేదా అనే విషయాన్ని సంబంధిత బాధితురాలు మాత్రమే వివరించగలదని పేర్కొంది. ఈ కేసులో యువతి స్వయంగా కేసును కొనసాగించేందుకు ఆసక్తి చూపకపోవడం, ఎలాంటి సాక్ష్యాలు సమర్పించకపోవడం, పైగా రాజీకి అంగీకరించడం వంటి అంశాలను ధర్మాసనం ప్రస్తావించింది. అలాంటి పరిస్థితుల్లో నియామక అధికారులు తమంతట తామే ఊహాగానాలు చేసి అభ్యర్థి వ్యక్తిత్వంపై చెడు అభిప్రాయం ఏర్పరచుకోవడం సమంజసం కాదని స్పష్టం చేసింది. సంబంధిత వ్యక్తుల వ్యక్తిగత జీవితాలకు సంబంధించిన అంశాలను చట్టపరమైన పరిమితుల్లోనే పరిశీలించాలని సుప్రీంకోర్టు సూచించింది. చట్టం నిషేధించని వ్యక్తిగత సంబంధాలను ఆధారంగా చేసుకుని ఒకరి ఉద్యోగ అవకాశాలను దెబ్బతీయడం సరైంది కాదనే సందేశాన్ని ఈ కేసులో తీర్పు ద్వారా అత్యున్నత న్యాయస్థానం ఇచ్చింది.

# వ్యవసాయ రుణాలు సకాలంలో చెల్లిస్తే 3 శాతం వడ్డీ







**నక్కపల్లి, పెన్ సత్తా, జూన్ 08:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘము ద్వారా రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలు సకాలంలో చెల్లిస్తే 3 శాతం వడ్డీ మాత్రమే పడుతుందని నక్కపల్లి పిఏసిఎస్ చైర్పర్సన్ కొప్పిశెట్టి అన్నారు. పెదతీనార్ల లో సోమవారం నక్కపల్లి సొసైటీ ద్వారా రైతులకు అందిస్తున్న రుణాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సకాలంలో రుణాలు చెల్లిస్తే కేవలం 3శాతం వడ్డీకే వ్యవసాయ రుణాలు పొందవచ్చని, లేని పక్షంలో అధిక వడ్డీ చెల్లించ వలసి వస్తుందని తెలియజేశారు. సొసైటీ ద్వారా భూమి తనకా పై ఒక ఎకరం కు 5లక్షలు, డాక్యుమెంట్ కలిగిన స్లాబ్ ఇంటికి 5లక్షలు ఋణం గా ఇవ్వడం జరుగుతుందన్నారు.త నకా పై ఇచ్చే రుణాలు రైతుల అవసరాలు దృష్టిలో పెట్టుకొని ఎకరాకు 7లక్షలు వరకు పెంచాలని డీసీసీబీ ని కోరడం జరిగిందని, త్వరలో అమలు జరుగుతుందని ఈ సందర్భంగా తెలియచేయడం జరిగింది. రైతుల విజ్ఞప్తి మేరకు భూమి తనకా రుణాలు ఒక రైతుకు ప్రస్తుతం 5లక్షలు వరకు ఇస్తుండగా దానిని 10లక్షలు వరకు పెంచడానికి ఆలోచన చేస్తున్నామని కొప్పిశెట్టి బుజ్జి తెలియచేసారు. ముఖ్యంగా తనకా రుణాలు తీసుకున్న రైతులుకు లోన్ అమౌంట్ మొత్తానికి ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని గత మహాజన సభలో ప్రస్తావించడం జరిగిందని, ఇప్పుడు దానిని డీసీసీబీ అమలుకు చర్యలు తీసుకుంటుందని రైతులకు వివరించారు. జరిగింది. ఈ కార్యక్రమములో అడ్డరోడ్డు బ్రాంచ్ మేనేజర్ జాన్సీలక్ష్మి , సూపర్వైజర్ సతీష్, సొసైటీ డైరెక్టర్ లు కోసూరి శ్రీను, మనబాల కొండబాబు, సీఈవో శ్రీనివాస్, సిబ్బంది ఖాన్, గోవింద్, నాగేష్ రైతులు గోసల తాతారావు, పీక్కి కొర్లయ్య, బొంది దేవుడు, వెంకటరమణ, మహేష్, గిరీష్, గరికిన నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ అగ్నిప్రమాద స్థలాన్ని సందర్శించిన హోం మంత్రి అనిత, ఎం.పీ భరత్



**విశాఖ, పెన్ సత్తా, జూన్ 08:** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర అగ్నిప్ర మాద ఘటనపై రాష్ట్ర హోం, విపత్తుల నిర్వ హణ శాఖ మంత్రి వంగలపూడి అనిత, విశా ఖపట్నం లోక్‌సభ సభ్యుడు ఎం. భరత్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎం. పరశు రామరాజు సంఘటన స్థలాన్ని సందర్శించారు.ఈ సంద ర్భంగా ప్రమాదానికి గల కారణాలపై అధికా రులను అడిగి తెలుసుకుని, ఘటనకు సంబం ధించిన వివరాలను సమీక్షించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సదుపా యాలు అందించి, అవసరమైన అన్ని సహాయ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించా రు.అనంతరం బాధితుల పరిస్థితిపై ఆరా తీసిన ప్రజాప్రతినిధులు, ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ స్టేట్ బిల్డింగ్ కమిటీ సభ్యుడు బొత్సా సురేష్ కుమార్, బీజేపీ స్టేట్ మీడియా ప్యానలిస్ట్ కే. నర్సింగరావు, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి రవిరాజ్, జిల్లా కార్యద ర్శి సోంబాబు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రాకేష్‌తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సగ్గులులో జెడ్పినిధులతో సిసి రోడ్డు నిర్మాణం



**ముంచంగిపుట్టు, పెన్ సత్తా, జూన్ 08:**

మండలంలో గల బరడ పంచాయతీ, సగ్గులు గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు 5లక్షలతో 100 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానీకి శంకుస్థాపన చేసినట్లు బరడ పంచాయతీ ఎంపిటిసి కోడా నబ్బో తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. సగ్గులు గ్రామస్తులు సిసి రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నా పరిస్థితుల దృష్ట్యా జెడ్పీ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకువెళ్లి సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేశామన్నారు. పంచాయతీలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎంపిటిసి, మాజీ సర్పంచ్ తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన ఎంపిటిసి, మాజీ సర్పంచ్లకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తిరుపతి, రొగ్గు, గాసి, సీతారాం, గోపాల్ రావు, రామో, సర్బీ గురుబారి, ఈశ్వరి, డొమిని, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భూ వివాదం పై డీఐజీ కి ఫిర్యాదు..

**సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తీరు పై బాధితుల ఆవేదన**

**అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌లో రసీదు ఇవ్వలేదని ఆరోపణ..**

**న్యాయం చేయాలని 13 మంది వినతి.**




**అచ్యుతాపురం, పెన్ సత్తా, జూన్ 08:** మండలం భోగాపురం, దుప్పితూరు గ్రామాల పరిధి లోని 31.67 సెంట్ల భూమి వివాదం పై లాలం దేముడమ్మతో సహా 13 మంది బాధితులు విశాఖపట్నం రేంజ్ డీఐజీ కి సోమవారం ఫిర్యాదు చేశారు.
పిర్యాదు పై బాధితులు పత్రికా ప్రకటన ద్వారా వివరాలు తెలుపుతూ
06-06-2026 న అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇచ్చేందుకు వెళ్లగా పిర్యాదు రసీదు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇవ్వక పోగా వివాదంతో సంబంధం లేని బయట వ్యక్తితో సెటిల్మెంట్ చేయిస్తానని బెదిరించారని వినతిపత్రంలో పేర్కొన్నారు. పైలా వెంకటస్వామి అనే వ్యక్తి ఫేక్ డాక్యుమెంట్లతో ఆస్తి కాజేసేందుకు ప్రయత్నిస్తున్నాడని, పీఆర్ఎస్ నాయుడు, కూండ్రపు సత్యా నుండి తమకు ప్రాణహాని ఉందని బాధితులు ఆరోపించారు.
దుప్పితూరులో 26.78 సెంట్లు, భోగాపురంలో 4.89 సెంట్లు కలిపి 31.67 సెంట్ల భూమిని 2000 సంవత్సరంలో డాక్యుమెంట్ నెం.1333/2000, 1534/2000 ద్వారా విక్రయించగా, ఐదు లక్షలు మాత్రమే ఇచ్చి మిగిలిన మొత్తం ఇవ్వకుండా మోసం చేశారని తెలిపారు. ఈ వివాదం పై 2004 లో విశాఖపట్నం 2 వ అడిషనల్ జిల్లా కోర్టులో ఓఎస్ నెం.357/2004 దాఖలు చేయగా, 16-08-2005 న తమకు అనుకూలంగా ఇంజంక్షన్ ఆర్డర్ వచ్చిందన్నారు.
అయితే తమకు తెలియకుండా 08-01-2026, 12-02-2026 తేదీల్లో కేసు ఉపసంహరించుకుని, ఎంఓయు ద్వారా ఆస్తి కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోయారు. 10 కోట్లు ఇస్తామని నమ్మించి భూమిని 'నవరత్న ఎస్టేట్స్' యజమాని సురేష్ జైన్ పేరున సేల్ డీడ్ చేయించారని, లాలం రాంబాబు సమక్షంలో పంచాయితీ జరిపి అసలు 10 కోట్లు, వడ్డీ 2 కోట్లు కలిపి 12 కోట్లు ఇస్తామని ఒప్పుకుని 50 లక్షలు మాత్రమే ఇచ్చి మిగిలిన 11.50 కోట్లు ఎగ్గొట్టారని వినతిపత్రంలో 13 మంది (1) లేటు లాలం రాంబాబు భార్య లాలం దేముడమ్మ, (2) బండారు కన్నయ్య భార్య బండారు లక్ష్మి, (3) రెడ్డి లేటు నూకరాజు భార్య రెడ్డి రాము, (4) లాలం దేముడమ్మ వారసులు లాలం అప్పలరాజు, (5) లాలం నూకరాజు, (6) రొంగల లేటు ఉమేంద్ర భార్య సరోజిని, (7) బండారు లక్ష్మి వారసులు బండారు భాగ్యలక్ష్మి, (8) బండారు నవీన్, రెడ్డి రాము వారసులు, (9) రెడ్డి సరోజ, (10) రెడ్డి నాగేశ్వర రావు, (11) కూండ్రపు లేటు నూకరాజు భార్య లక్ష్మి ఈమె వారసులు, (12) గుడివాడ లక్ష్మి వైఫ్/ఆఫ్ నాయుడు, (13) లాలం చిటెమ్మ వైఫ్/ఆఫ్ లాలం నూకరాజు ఫిర్యాదులో పేర్కొన్నారు. డీఐజీ వెంటనే జోక్యం చేసుకుని మాకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

# వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీ దొంగతనం కేసు ఛేదించిన పోలీసులు




**5 రోజుల్లోనే నిందితుల అరెస్ట్.**

**రూ.17.68 లక్షల విలువైన సొత్తు స్వాధీనం.**

**అనకాపల్లి (నక్కపల్లి), పెన్ సత్తా, జూన్ 08:** అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలం, ఉపమాక గ్రామం లోని ప్రసిద్ధ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తేదీ.02.06.2026 రాత్రి అనగా (తేదీ 03.06.2026 తెల్లవారుజామున సుమారు 01:00 గంటల సమయంలో) భారీ దొంగతనం జరిగింది. ముఖాలకు మాస్కులు ధరించిన ఇద్దరు దొంగలు తొలుత కొండ పై దొంగతనానికి ప్రయత్నించి, వీలుకాకపోవడంతో కిందకు దిగి ఆలయం లోకి ప్రవేశించారు. గర్భగుడి ముందున్న ప్రధాన హుండీతో పాటు, ఆండాళమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఉన్న హుండీని కట్టర్‌తో కట్ చేసి, భక్తులు సమర్పించిన బంగారం, వెండి కానుకలతో పాటు రూ.1,20,000/-కి పైగా నగదును దొంగిలించారు. ఈ ఘటన పై టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైం.నం. 124/2026, యు/ఎస్ 305(ఏ), 331(4) బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేయబడింది. ఈ దొంగతనం కేసును పోలీసులు మెరుపు వేగంతో దర్యాప్తు చేసి నిందితుల అరెస్ట్ చేశారు. ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాస రావు పర్యవేక్షణలో నక్కపల్లి ఇన్‌స్పెక్టర్ మురళి, నక్కపల్లి రూరల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, కోటవురట్ల, పాయకరావుపేట, ఎస్.రాయవరం ఎస్ఐలతో ప్రత్యేక పోలీస్ బృందాలను రంగం లోకి దించారు. ఈ బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టి, సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, విశ్వసనీయ సమాచారాన్ని సేకరించాయి. ఇందులో భాగంగా తేదీ 07.06.2026 న ఉద్దండపురం బస్ స్టాప్ వద్ద ఇద్దరు అనుమానితులను అదుపు లోకి తీసుకుని విచారించగా, తామే ఈ చోరీకి పాల్పడినట్లు నిందితులు అంగీకరించారు. అరెస్టు చేయబడిన నిందితుల వివరాలు
1, కసిరెడ్డి శ్రీహరి (వయస్సు 22) తండ్రి: అప్పారావు, వృత్తి: వెల్డింగ్ పని, నివాసం రేవల్ల కొత్తూరు గ్రామం, నక్కపల్లి మండలం.
2, గంట్యాడ చిన్న (వయస్సు 23), తండ్రి: అప్పారావు, వృత్తి: వెల్డింగ్ పని, నివాసం: రేబాక గ్రామం, నక్కపల్లి మండలం. వీరివద్ద నుండి స్వాధీనం చేసుకున్న సొత్తు, సామాగ్రి: నిందితుల నుంచి దొంగిలించబడిన వస్తువులను, నేరానికి ఉపయోగించిన సామాగ్రిని పోలీసులు పూర్తిగా రికవరీ చేశారు.1. దొంగిలించిన నగదు రూ.2,38,078.
2. బంగారం కానుకలు 56 గ్రాములు (విలువ సుమారు రూ.8,28,800).
3. వెండి కానుకలు 02 కేజీల 600 గ్రాములు (విలువ సుమారు రూ.7,02,000). మొత్తం స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ సుమారు రూ.17,68,000. వీళ్ళు ఈ నేరానికి ఉపయోగించిన కత్తి, పట్టకారు, కట్టర్, చేతి గ్లోవ్స్, నేరం చేసే సమయంలో నిందితులు ధరించిన మెరూన్ కలర్ టీ-షర్ట్, నైట్ ప్యాంట్లు, వైట్ స్లిప్పర్స్‌ను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కేసును చేసించిన
?పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ అభినందనలు తెలిపారు.
?ఘటన జరిగిన కేవలం 5 రోజుల వ్యవధి లోనే కేసును అత్యంత చాక చక్యంగా దర్యాప్తు చేసి, నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు వంద శాతం రికవరీ సాధించిన డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు, సిఐలు మురళి, రామకృష్ణ, అప్పల నాయుడు, ప్రత్యేక బృందాల్లోని ఎస్ఐలు సన్ని బాబు, సాహిబా అంజుమ్, మహమ్మద్ అలీ షరీఫ్, ఇతర సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. వారికి ప్రశంసా పత్రాలు, నగదు రివార్డులను అందజేశారు. ఈ చోరీ ఘటనను దృష్టిలో ఉంచుకుని జిల్లా లోని అన్ని ప్రముఖ దేవాలయాల వద్ద భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. అన్ని ఆలయాల్లో రాత్రి వేళల్లో పోలీసు గస్తీ (పెట్రోలింగ్) పెంచాలని సూచించారు.
?దేవాలయాల యాజమాన్యాలు, దేవాదాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, ఆలయ ప్రాంగణాల్లో హై-రిజల్యూషన్ సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, నైట్ వాచ్‌మెన్‌ల నియామకం, హుండీల భద్రతకు ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు (ఐరన్ గ్రిల్స్ వంటివి) చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# హౌసింగ్ బిల్లులకై 15న ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా

**పెన్ సత్తా, జూన్ 08:** జనరల్ హౌసింగ్ సర్వీసెస్ ఇన్ లబ్ధిదారుల ఖాతాలో బిల్లులు జమ చేయాలని, ఏం జన్మన్ హౌసింగ్ బకాయి వెంటనే విడుదల చేయాలని ఈనెల 15వ తేదీన ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం ఎం శ్రీను, కొర్ర నరసయ్య తెలిపారు. ఈ నేపథ్యంలోనే మండలంలో గల స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో మండల కమిటీ విస్తృత స్థాయి సమావేశం ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎం ఎం శ్రీను అధ్యకతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీఎం జన్మన్ స్కీమ్ ద్వారా హౌసింగ్ లబ్ధిదారులు నేటికి లింటల్, స్లబ్ వేసి 8 నెలలు గడుస్తున్నా హౌసింగ్ అధికారులకు అనేకదపాలు విన్నవించిన నేటికీ బిల్లు మంజూరు చేయటం లేదని, సంబంధిత అధికారులు జాప్యం తగదని, లబ్ధిదారులు నుండి వసూలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనరల్ హౌసింగ్ సర్వే చేసిన లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయాలని, ఈ నెల 15వ తేదీన ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ధర్నాకు హౌసింగ్ లబ్ధిదారులు తరలివచ్చి ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జి నారాయణ జి జీనాబందు, కె డోంబురు, సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాల పై స్టాళ్లు ఏర్పాటు చేయాలి కలెక్టర్ విజయ క్రిష్ణన్

**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 08:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు ప్రతి శాఖ ప్రత్యేకంగా స్టాళ్లను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా అధికారులతో సంక్షేమ పథకాల అమలు, వాటి లబ్ధిదారుల వివరాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పథకాల లబ్ధిదారుల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించాలని, కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం లోని ప్రతి శాఖ తమ స్టాళ్లను ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. శాఖల వారీగా ఏర్పాటు చేసే స్టాళ్ల డిజైన్లకు సంబంధించి జాయింట్ కలెక్టర్ దగ్గర ముందస్తు అనుమతి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అందుబాటులో ఉన్న స్థలం, ఏర్పాటు చేయగల స్టాళ్ల సంఖ్యను బట్టి ప్రణాళికలు సిద్ధం చేయాలి. అవసర మైతే కొన్ని విభాగాలను క్లబ్ చేసి ఉమ్మడిగా స్టాళ్లను నిర్వహించవచ్చని తెలిపారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి నుండి క్షేత్రస్థాయిలో స్పందన (టెస్టిమోనియల్స్) సేకరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కేవలం దారిపోయే వారి నుండి కాకుండా, పథకాల వల్ల నిజంగా లబ్ధి పొందిన 20 నుండి 30 మంది జెన్యూన్ లబ్ధిదారులను గుర్తించి వారి వివరాలు సేకరించాలని తెలిపారు. ఈ వివరాలను, లబ్ధిదారుల వీడియో రికార్డింగులను సమాచార పౌర సంబంధాల శాఖ (ఐడిపిఆర్)కు అందించాలని పేర్కొన్నారు.

సమావేశంలో కలెక్టర్ వివిధ శాఖలకు సంబంధించిన పథకాలను, వాటి కనీస లబ్ధిదారుల (కనీసం 30 మంది) వివరాల సేకరణ బాధ్యతలను స్పష్టం చేశారు.

విద్యాశాఖ – తల్లికి వందనం, ఏపీఎస్ఆర్టీసి – శక్తి స్కీమ్, దివ్యాంగ శక్తి, పౌరసరఫరాల – శాఖదీపం 2, సమాచార శాఖ – అన్నా క్యాంటీన్స్, జూనియర్ అడ్వకేట్స్ (10,000 స్టైపెండ్), వ్యవసాయ శాఖ – అన్నదాత సుఖీభవ, డిఆర్డిఏ ఉ మెప్మా – ఎన్టీఆర్ భరోసా, మత్స్య శాఖ – మత్స్యకార భరోసా, జీవో 217 రద్దు అంశం, రవాణా శాఖ – ఆటో డ్రైవర్ల సంక్షేమం, వైద్య ఆరోగ్య శాఖ (డిఎంహెచ్ఓ) ఉ ఇచ్డ్సఅం – గన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్ల గ్రాట్యుటీ, ఎన్టీఆర్ బేబీ కిట్స్, ల్యాండ్ రెవెన్యూ (డిఆర్వో) –హౌస్ సైట్ పట్టాలు, చేనేత, జౌళి శాఖ – చేనేత కార్మికులకు 10% రిజర్వేషన్, వీవర్స్ సంక్షేమం, బీసీ వెల్ఫేర్ గోల్డ్‌స్మిత్ కమ్యూనిటీ కార్పొరేషన్, నాయి బ్రాహ్మణుల జీతాలు, మైనారిటీ వెల్ఫేర్ పాస్టర్స్, ఇమామ్స్, ముజమ్మిన్స్, వక్ఫ్ బోర్డు అంశాలు, దేవాదాయ శాఖ అర్చకుల (టెంపుల్ ప్రీస్ట్స్) సంక్షేమం, లబ్ధిదారుల వివరాలు, వీడియోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే ముందు ప్రతి ఒక్కటి క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. ఎలాంటి అర్థరహిత మైన లేదా తప్పుడు సమాచారాన్ని అప్‌లోడ్ చేసినా సహించేది లేదని, బాధ్యులైన అధికారుల పై కఠిన చర్యలు ఉంటాయని ఆమె తీవ్రంగా హెచ్చరించారు. జూనియర్ అడ్వకేట్లుకు అందిస్తున్న నెలకు 10,000 స్టైపెండ్ పథకం పై ఐ అండ్ పిఆర్ విభాగం ఫీడ్‌బ్యాక్ సేకరించాలి. ఉచిత సోలార్ రూఫ్‌టాప్ ఇన్‌స్టాలేషన్లకు సంబంధించిన వివరాలను ఈపీడీసీఎల్ విభాగం సేకరించాలి. ?మెగా డీఎస్సీ ఉ ఉపాధ్యాయుల బదిలీలను విద్యాశాఖ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. కొత్తగా రిక్రూట్ అయిన ఉపాధ్యాయుల వివరాలను సేకరించాలి. పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను పర్యవేక్షించాలి. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బకాయిల చెల్లింపుల పై ట్రెజరీ విభాగం నివేదిక సిద్ధం చేయాలి. మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవుల పొడిగింపు అంశం పై ఐసీడీఎస్ విభాగం బాధ్యత వహించాలి. ప్యాడీ ప్రొక్యూర్మెంట్ బాధ్యతలను పీఎంసీఎస్ విభాగం పర్యవేక్షించాలి. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి డిఏఓ, మార్కెట్ ఇంటర్వెన్షన్ కోసం ఏడీ మార్కెటింగ్ విభాగాలు సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.






డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్ లు ఆరోగ్య రక్షణ చర్యల పై దృష్టి పెట్టాలి. మధ్యాహ్న భోజన పథకం, ఎడ్యుకేషన్ కిట్స్, పేరెంట్–టీచర్ మీటింగ్స్ వివరాలను విద్యాశాఖ సేకరించాలి. పార్ట్–హోల్ ఫ్రీ రోడ్స్ పనులను ఆర్ అండ్ బి శాఖ, 4,000 కిలో మీటర్ల గ్రామీణ రహదారుల పనులను ద్వామ (డిడబ్ల్యుఎంఏ) పంచాయతీరాజ్ ఈఈ పర్యవేక్షించాలన్నారు. జల్ జీవన్ మిషన్ కింద సురక్షిత తాగునీటి సరఫరా బాధ్యతను ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పర్యవేక్షించాలన్నారు. రాష్ట్రం లోకి వస్తున్న నూతన పారిశ్రామిక ప్రాజెక్టుల పై జెడ్ఎమ్ ఏపీఐఐసీ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సూచించారు. జలధార, మెకానికల్ పనులు, వాటర్ యూజర్ అసోసియేషన్, డిసిల్టేషన్ పనుల పై ఇరిగేషన్ శాఖ నివేదిక ఇవ్వాలి. ఐటీ, ఎంఎస్ఎమ్ఈ పాలసీల లబ్ధిదారుల వివరాలను ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్ సేకరించాలని తెలిపారు. 15 వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి సర్పంచుల టెస్టిమోనియల్స్, అలాగే ఇద్దరు కంటే ఎక్కువ పిల్లలు ఉన్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయవచ్చనే నిబంధన పై సీఈఓ జెడ్పీ వివరాలు సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం డీపీఓ ఆధ్వర్యంలో చేపట్టిన మేజర్ వ్యర్థాల తొలగింపు, డ్రైన్ల క్లీనింగ్, లెగసీ వేస్ట్ క్లీనింగ్ వంటి పనుల పై ప్రజల నుండి స్పందనలను సేకరించాలి. మున్సిపాలిటీల పరిధిలో జరుగుతున్న డోర్–టు–డోర్ చెత్త సేకరణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పై మున్సిపల్ అధికారులు, లబ్ధిదారుల టెస్టిమోనియల్స్ సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు పంపిణీ చేసిన పట్టాదార్ పాస్‌బుక్కుల పై రెవెన్యూ శాఖ రైతుల నుండి నేరుగా అభిప్రాయాలను సేకరించాలి. జీఎస్డబ్ల్యూఎస్ పరిధి లోని 'మన మిత్ర' క్యాంపెయిన్, వాట్సాప్ గవర్నెన్స్ వంటి డిజిటల్ సేవల పై ప్రజల స్పందనలను తీసుకోవాలి. అవేర్ యాప్ పై రెవెన్యూ శాఖ బాధ్యత వహించాలని అన్నారు. పాఠశాలల్లో అమలు చేస్తున్న 'ముస్తాబ్' కార్యక్రమం పై విద్యాశాఖ నివేదిక సిద్ధం చేయాలని, పవర్ సెక్టార్, ఇండస్ట్రీస్ విభాగానికి సంబంధించి కలెక్టర్ మార్గదర్శకాలు జారీ చేశారు. ఆర్డీఎస్ఎస్ పథకం, కొత్త విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, సోలార్ రూఫ్ టాప్, పీఎం కుసుమ్ పథకాల పరిధిలో సాధించిన ప్రగతి పై సమగ్ర నివేదికలు అందించాలని కలెక్టర్ తెలిపారు. అటవీ శాఖ, వీఎస్ఎస్ పరిధిలో అటవీ అనుమతులు, రోడ్ కనెక్టివిటీ, సీడ్ బాల్స్ పంపిణీ, వెదురు సాగు, వివిధ రకాల పంటల సాగు పై గిరిజనులు, సాధారణ రైతుల నుండి టెస్టిమోనియల్స్ సేకరించాలని, నర్సరీల పెంపకం, పేపర్ ఫ్యాక్టరీల నుండి రైతుల వరకు పంపిణీ చేసిన మొక్కల వివరాలు, ప్లాంటేషన్ యాక్టివిటీస్ రూపొందించాలన్నారు. ఐ అండ్ పిఆర్ విభాగం ప్రతిరోజూ కనీసం 3 నుండి 4 శాఖలకు సంబంధించిన లబ్ధిదారుల టెస్టిమోనియల్స్, విజయగాథలను అన్ని అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని జూన్ 20 వ తేదీ లోపు పూర్తి చేయాలని గడువు విధించారు.

జూన్ 16 న మత్స్యకారుల సదస్సు:

జూన్ 16 న నక్కపల్లి లేదా మైపాడులో (అధికారులు ప్లాన్ చేసిన ప్రదేశంలో) మత్స్యకారులతో ఒక భారీ సదస్సును నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ సదస్సుకు కనీసం 2,000 మంది మత్స్యకారులు హాజరయ్యే అవకాశం ఉన్నదని అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమం కోసం ఒక ఏసీ హాల్‌ను సిద్ధం చేయాలని, మిగిలిన అన్ని శాఖలు తమ స్టాళ్లను ప్లాన్ చేసుకోవాలని సూచించారు.

ఈ సదస్సు కేవలం వేదిక పై ఉన్నవారు మాట్లాడటం, కింద ఉన్నవారు వినడం లాంటి సాధారణ సభలా ఉండకూడదు. ఇది పూర్తిగా ప్రజలు పాలుపంచుకునే ఇంటరాక్టివ్ సెషన్‌గా సాగాలన్నారు. అందు కోసం ప్రతి శాఖ నుంచి పథకాల పై స్పష్టంగా మాట్లాడగలిగే ఐదుగురు లబ్ధిదారులను గుర్తించాలన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబన, పారిశ్రామికాభివృద్ధి పై ప్రత్యేక కార్యాచరణ. మహిళా పారిశ్రామికవేత్తలు డిఆర్డీఏ, ఎల్‌డీఎం, మెప్మా సంయుక్తంగా వన్ ఫ్యామిలీ – వన్ ఎంటర్ ప్రెన్యూర్ (ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త) విధానం కింద మహిళలను పారిశ్రామిక రంగం వైపు ప్రోత్సహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ కింద ప్రసిద్ధ ఏటికొప్పాక చెక్క బొమ్మల (టాయ్స్) తయారీ, విక్రయాల ప్రక్రియను మెరుగుపరచాలని అన్నారు. సోషల్ ఫారెస్ట్రీ కింద నర్సరీల పెంపకం నుండి మొదలు కొని పేపర్ ఫ్యాక్టరీలు, బే బ్రిడ్జిలు, సాధారణ రైతుల వరకు ఎంత మందికి ఎన్ని మొక్కలు పంపిణీ చేశామనే ప్లాంటేషన్ యాక్టివిటీస్ అన్నింటినీ నివేదికలో చేర్చాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యనారాయణ రావు, ఇతర అనుబంధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పంచాయతీల సమస్యలపై టీడీపీ ప్రత్యేక సమావేశం 10న

**ప్రతి నెల రెండో బుధవారం టీడీపీ సమీక్షా సమావేశం**

**పెన్ సత్తా, జూన్ 08:** రాష్ట్ర పార్టీ అధిష్టానం ఆదేశాలు, పాడేరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సూచనల మేరకు గూడెంకొత్తవీధి మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం ఈ నెల 10వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని స్థలం కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని పంచాయతీల సమస్యలు, ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతం, గ్రామస్థాయి కార్యకలాపాలు తదితర అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రతి నెల రెండో బుధవారం ఇదే తరహా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి మండల కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, బూత్ యూనిట్ ఇన్‌చార్జీలు, కన్వీనర్లు, కో–కన్వీనర్లు, సహకార సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ మండల అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ సీనియర్ నాయకులు, వివిధ నామినేటెడ్ పదవుల్లో ఉన్న నాయకులు, దేవాదాయ శాఖ, సాగునీటి సంఘాలు, విద్యాశాఖ కమిటీల చైర్మన్లు, డైరెక్టర్లు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

# విశాఖ ద్వారకా బస్ స్టేషన్‌ను సందర్శించిన ఎం.పీ. భరత్



**విశాఖ దక్షిణం, పెన్ సత్తా, జూన్ 08:** విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఆదివారం ఏపీఎస్ఆర్టీసీ ద్వారకా బస్ స్టేషన్‌ను సందర్శించి వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బస్ స్టేషన్ ప్రధాన ప్రవేశ ద్వారం నుంచి కార్గో పాయింట్ వరకు తనిఖీ చేసిన ఎంపీ, పార్శిల్ సేవలను మరింత వేగవంతంగా అందించి ప్రజల మన్ననలు పొందాలని అధికారులకు సూచించారు. అలాగే ప్లాట్‌ఫారాలు, స్టాల్స్, బస్సుల పరిశుభ్రత, మరుగుదొడ్ల తదితర సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు, కండక్టర్లు, డ్రైవర్లు, సూపర్వైజర్లు, అధికారులు, ప్రయాణికులతో మాట్లాడి వారి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. ద్వారకా బస్ స్టేషన్‌ను మరింత అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏపీఎస్ఆర్టీసీ విశాఖ జిల్లాలో స్త్రీ శక్తి పథకం సమర్థవంతంగా అమలవుతోందని, ఇప్పటివరకు రూ.185 కోట్ల మేర ప్రయోజనాలు అందాయని పేర్కొన్నారు. రోజుకు సుమారు నాలుగు లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తున్న విశాఖ జిల్లాకు మరింత సహకారం అందించేలా కృషి చేస్తామని తెలిపారు.

ఈ సందర్భంగా విశాఖపట్నం రీజనల్ మేనేజర్ బి. అప్పలనాయుడు ఎంపీకి స్వాగతం పలికి, బస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను చూపించారు. సంస్థ అభివృద్ధికి అధికారులు, సిబ్బంది సమిష్టిగా కృషి చేస్తున్నట్లు వివరించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పద్మావతి, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ గంగాధర్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రాజు, అసిస్టెంట్ ఇంజనీర్లు, అసిస్టెంట్ మేనేజర్లు మరియు విశాఖ జిల్లా ఏపీఎస్ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

# అన్ని కోణాల నుంచి ఆలోచించి సమస్యలకు పరిష్కారం చూపాలి

**జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్**

**విశాఖ దక్షిణం, పెన్ సత్తా, జూన్ 08:** ప్రజల నుంచి వచ్చే వినతులను సమగ్రంగా పరిశీలించి, అన్ని కోణాల నుంచి ఆలోచించి సమస్యలకు సరైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సేవల అందుబాటు, ఫిర్యాదుల పరిష్కారంలో ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో కలెక్టర్ మాట్లాడుతూ, జీవీఎంసీ పరిధిలో వచ్చే ఫిర్యాదులు మరియు వాటి పరిష్కారంలో నాణ్యత లోపించడం వల్ల జిల్లా ర్యాంకింగ్‌పై ప్రభావం పడుతోందని అన్నారు. సాధారణ అధికార యంత్రాంగంతో పాటు జీవీఎంసీ సిబ్బంది కూడా ప్రజా సమస్యల పట్ల అంకితభావంతో పనిచేస్తేనే ఫలితాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్, జాయింట్ కలెక్టర్ , డీఆర్వో ఎ. విశ్వేశ్వరనాయుడు, ఏడీసీ సత్యవేణిలతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 331 వినతులు అందాయి. వాటిలో

రెవెన్యూ శాఖకు సంబంధించినవి 79

జీవీఎంసీకి సంబంధించినవి 96 పోలీసు శాఖకు సంబంధించినవి 25

ఇతర శాఖల కు సంబంధించినవి 31 ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# చంద్రబాబు పాలనలో హామీల అమలులో వైఫల్యం

**వాసుపల్లి గణేష్ కుమార్ విమర్శలు**




**విశాఖ దక్షిణం, పెన్ సత్తా, జూన్ 08:** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫల మైందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త విమర్శించారు. "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ జంక్షన్ సమీపంలోని ఆమ్మోరా ఫంక్షన్ హాల్‌లో వాసుపల్లి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీతో పాటు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ కులాలు, మత సంఘాలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెడు వినకు, చెడు చూడకు, చెడు మాట్లాడకు అనే వానరాల ఆకృతులను పోలిన వ్యంగ్య వేషధారణల్లో మాస్కులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సమావేశంలో మాట్లాడిన వాసుపల్లి గణేష్ కుమార్, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు మేలు చేశాయని, మాజీ ముఖ్యమంత్రి సుపరిపాలన అందించారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరిట ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని, రైతులకు సమయానికి యూరియా అందక పంటలు నష్ట పోయాయని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. అలాగే కేజీహెచ్ అభివృద్ధికి వైసీపీ ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. గీతం యూనివర్సిటీకి సంబంధించిన భూవివాద అంశాన్ని ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదల భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. అలాగే కేంద్ర హోంమంత్రి వద్ద జగన్ మోహన్ రెడ్డికి మంచి పేరు ఉందని వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, జిల్లా, రాష్ట్ర స్థాయి వైసీపీ నాయకులు, వివిధ వార్డుల ప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


# పార్టీలకతీతంగా భూ దందాలు

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కావలి నియోజకవర్గంలో రకరకాల భూ దందాలు జరిగినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించి లేఔట్స్ వేశారు. అప్పటి అధికారులను మేనేజ్ చేసుకుని మరికొందరు ప్రభుత్వ, కాలువ భూములను పట్టా భూములుగా చూపించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దానికి సంబంధించి అప్పటి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డికి ప్రధాన అనుచరుడు మన్నెమాల సుకుమార్ రెడ్డి మీదే ఆరోపణలు ఎక్కువగా వచ్చాయి. ఆయనతో పాటు మరో నలుగురు వేసిన లేఔట్లపై కూడా ప్రస్తుతం విజిలెన్స్ దర్యాప్తు జరుగుతోంది. అధికారులు లోతుల్లోకి వెళ్ళి దర్యాప్తు చేస్తుండటంతో అక్రమార్కులకు వణుకు పుడుతోందట. ఆ క్రమంలోనే... వాళ్ళు సరికొత్త ఆలోచనలకు పదునుపెట్టే తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్న ప్రచారం కలకలం రేపుతోంది. గత ఎన్నికల్లో కావలి ఎమ్మెల్యేగా కావ్య కృష్ణారెడ్డి గెలిచాక వైసీపీ హయాంలో వేసిన అక్రమ లేఔట్లపై విచారణ జరిపిస్తామని ప్రకటించారు. అందులో భాగంగానే ఇటీవల ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అది తుది దశకు చేరుకుందనుకుంటున్న సమయంలో దర్యాప్తు అధికారుల మీద దౌర్జన్యాలు జరగడం కలరలం రేపుతోంది. వీటి వెనక స్థానిక టిడిపి నేతలు ఉన్నారన్న మాటలతో ఇంకా షాకవుతున్నారట స్థానికులు. అసలు అక్రమ లేఔట్లపై దర్యాప్తు ప్రారంభించిన విజిలెన్స్ అధికారులకు మొదట రెవెన్యూ డిపార్ట్మెంట్ సహకరించలేదట. రికార్డులు ఇచ్చేందుకు కూడా కింది స్థాయి అధికారులు ఆసక్తి చూపలేదని తెలిసింది. చివరికి కలెక్టర్ ఆదేశాలతో రికార్డులు తెప్పించుకున్న విజిలెన్స్ అధికారులు సుమారు 78 లేఅవుట్లను పరిశీలించారు. ఇందులో చాలావరకు అక్రమాలు జరిగాయని ప్రాథమిక దర్యాప్తులో బయటపడిందని అంటున్నారు. ముగ్గురు వ్యక్తులు అప్పట్లో అధికారాన్ని అడ్డం పెట్టుకుని సుమారు 300 ఎకరాల్లో అక్రమ లేఔట్లు వేసినట్టు ప్రాథమిక అంచనాకి వచ్చారట. ప్రభుత్వ భూములకు దొంగ పట్టాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు కూడా చేశారని.. వాటి విలువ ఇప్పుడు 100 కోట్లకు పైనే ఉంటుందని దర్యాప్తు అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. ఈ క్రమంలో.. దీని నుంచి తప్పించుకునేందుకు అప్పట్లో అక్రమాలకు పాల్పడ్డ వాళ్ళంతా ఇప్పుడు టిడిపి ద్వితీయ శ్రేణి నేతలతో చీకటి ఒప్పందాలు చేసుకున్నారన్న ప్రచారం కావలిలో కాక రేపుతోంది. గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన నేతల బండారం విజిలెన్స్ ఎంక్వయిరీలో బయటపడుతూ ఉండడంతో ...వాళ్ళంతా ఉలిక్కిపడుతున్నారట. ఎలాగైనా దర్యాప్తును అడ్డుకోవాలనే ఉద్దేశ్యంతో అధికార పార్టీ నేతలకు టచ్ లోకి వెళ్లినట్టు చెప్పుకుంటున్నారు. ఆ టచ్చింగ్స్ కారణంగానే.... కావలి ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామకృష్ణ... విజిలెన్స్ అధికారులపై దౌర్జన్యానికి పాల్పడ్డారని సొంత పార్టీలోనే మాట్లాడుకుంటున్నారు. వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యేకి అత్యంత సన్నిహితంగా ఉన్న కీలక నేత ఒకరు.. ఇప్పుడు టిడిపి నేతలకు వెనకుండి గైడ్ చేస్తున్నారన్న గుసగుసలు సైతం వినిపిస్తున్నాయి. మరోవైపు ఇప్పటికే అక్రమ లేఔట్లకు సంబంధించిన సూత్రధారులను గుర్తించిన విజిలెన్స్ అధికారులు.. వారికి సహకరించిన రియలెస్టేట్ బ్రోకర్స్, డాక్యుమెంట్ రైటర్ల వివరాలు సేకరిస్తున్నారట. దొరికిన వాళ్ళ నుంచి స్టేట్మెంట్స్ రికార్డు చేసే కార్యక్రమం కూడా నడుస్తోందని అంటున్నారు. అయితే విజిలెన్స్ విచారణకు సహకరించొద్దంటూ బ్రోకర్లు, డాక్యుమెంట్ రైటర్స్‌ను కూడా సదరు సదరు కీలక నేతే బెదిరిస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. దర్యాప్తు పూర్తి చేసి నెలాఖరులోపు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని అధికారులు గట్టిగా పనిచేస్తుంటే.. అది పూర్తయితే తమపై క్రిమినల్ కేసులు పెట్టే ప్రమాదం ఉందని అక్రమార్కులు భయపడుతున్నారట. అందుకే... ఎంక్వయిరీని ఆలస్యం చేసేందుకు.. స్థానిక ద్వితీయ శ్రేణి టిడిపి నేతలను రెచ్చగొట్టి అధికారుల మీదకు పంపుతున్నారన్నది లోకల్ టాక్. మా లేఔట్స్ మీద విచారణ చేసే అధికారం ఎవరిచ్చారంటూ విజిలెన్స్ అధికారులను బెదిరించడం కూడా టిడిపి ద్వితీయ శ్రేణి నేతల ప్లాన్‌లో భాగమేనని, అక్రమార్కులే తెరవెనుక ఉండి వాళ్లని పురమాయిస్తున్నారన్న ప్రచారం కావలిలో జరుగుతోంది. టీడీపీ నాయకులు దాడి చేసిన వ్యవహారాన్ని ఇప్పటికే విజిలెన్స్ ఉన్నతాధికారులు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లారట. సదరు నేతపై కేసు నమోదు చేసినప్పటికీ దీనికి సంబంధించి అటు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గానీ.. జిల్లా అధ్యక్షులు, అదే నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్సీ బీద రవిచంద్ర గాని నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని సొంత పార్టీ నాయకులే గుసగుసలాడుకుంటున్నారు. ఇన్ని ఆటంకాల మధ్య అక్రమ లేఔట్స్‌పై విజిలెన్స్ విచారణ నిష్పక్షపాతంగా జరుగుతుందా..? అక్రమార్కులపై క్రిమినల్ కేసులు పెడతారా అనేది ఉత్కంఠ గా మారింది.

# కార్గో వ్యతిరేక ఉద్యమం...

అసెంబ్లీ ఎన్నికల్లో పలాస నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచారు గౌతు శిరీష. ఇప్పుడు ఆమెకే నియోజకవర్గంలో సరికొత్త సమస్యలు ఎదురవుతున్నాయట. పార్టీ పవర్‌లో ఉండటం, తమ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన, జిల్లా వాసి కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రిగా ఉండటంతో పలాసకు ఓ మంచి ప్రాజెక్ట్ తీసుకురావాలని భావించారట ఎమ్మెల్యే. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తి చేయటంతో పాటు ఉపాధి అవకాశాలు సృష్టించేలా ప్రాజెక్ట్ కోసం ప్రయత్నించారామె. ఆ క్రమంలోనే పలాస ప్రాంతంలో కార్గో ఎయిర్ పోర్ట్ పెట్టాలని నిర్ణయించారు. ఇక్కడికి ఆ ప్రాజెక్ట్ వస్తే ఉద్దానం ప్రాంతం అభివృద్ధి అవుతుందంటూ ప్రచారం మెదలు పెట్టారు. అందుకు అవసరమైన భూ సేకరణ కోసం కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు ఎమ్మెల్యేగా గౌతు శిరీష కూడా స్థానికులతో మాటాడే ప్రయత్నం చేస్తున్నారట. కానీ పాలకులు చెబుతున్న అభివృద్ధి మాటల్ని స్థానికులు విశ్వసించడం లేదు. పైగా పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక ఉద్యమం మొదలైంది. మాకసలు అది వద్దే వద్దంటూ పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని గ్రామాల ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారుల సమావేశాల్లో సైతం మా ప్రాంతానికి కార్గో ఎయిర్‌పోర్ట్ అవసరం లేదని చెప్పేస్తున్నారు. అందుకు వాళ్ళ రీజన్స్ వాళ్ళకు ఉన్నాయి. పెద్దగా ఉపాధి అవకాశాలు ఇవ్వని కార్గో ఎయిర్ పోర్టు కోసం వేలాది ఎకరాల్లో ఉన్న జీడి, కొబ్బరి, మామిడి తోటల్ని పణంగా పెట్టేలేమన్నది స్థానిక రైతుల మాట. దీని గురించే ఇప్పుడు పలాసతో పాటు శ్రీకాకుళం జిల్లాలో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఉద్దానం ప్రాంతంలోని పల్లెల్లో చాపకింద నీరులా కార్గో వ్యతిరేక ఉద్యమం విస్తరిస్తోంది. పచ్చని తోటల్ని కొట్టివేయడం తమకు ఇష్టం లేదని అంటున్నారు రైతులు. కొందరైతే కాస్త డిఫరెంట్‌గా, ఇంకాస్త గట్టిగా తమ వాదన వినిపిస్తున్నారు. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించే ఫ్యాక్టరీ లాంటిది ఏదైనా వస్తే... ఇష్టం లేకున్నా... భవిష్యత్ కోసం భూములు ఇస్తాంగానీ. కేవలం కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో పరిమితమైన ఉపాధి దక్కుతుందంటే అలాంటి ప్రయోజనం లేని త్యాగాలకు మేం సిద్ధంగా లేమని తెగేసి చెబుతున్నారు. పైగా మా భూమిని లాక్కుని భూ బ్యాంక్ సిద్ధం చేసుకుంటామంటే ఒప్పుకునే ప్రసక్తే లేదని అంటున్నారు. ఈ వ్యవహారం మొత్తం అటుచేరి ఇటు చేరి స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీషకు చుట్టుకుంటోందట. దశాబ్దాలుగా గౌతు ఫ్యామిలీకి అండగా నిలుస్తున్నారు ఇక్కడి ప్రజలు. సర్దార్ గౌతు లచ్చన్నకు ఉన్న పేరు గురించి ప్రత్యేకంగా మాట్లాడుకోవాల్సిన అవసరం లేదు. ఆయన కుమారుడు గౌతు శివాజీ సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా పనిచేయటంతో పాటు, మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. కానీ... శివాజీ కుమార్తె అయిన శిరీషకు రాజకీయ పరిణితి లోపించిందని, ప్రజల మనోగతాన్ని తెలుసుకోలేకపోతున్నారన్న మాటలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా వెళితే... వాళ్ళకు మంచి చేయాలనుకోవడం ఏమోగానీ... భవిష్యత్‌లో ఇబ్బందులు మాత్రం తప్పవంటూ టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులే హెచ్చరిస్తున్నారు. దీనిపై వైసీపీ కూడా ప్రశ్నాస్త్రాలు సంధిస్తోంది. మూలపేట పోర్ట్ దగ్గర వేలాది ఎకరాల భూమి సిద్ధంగా ఉన్నప్పుడు దానికి దగ్గర్లోనే... ఇలా మరో భూ సేకరణ అవసరమా అన్నది ఫ్యాన్ క్వశ్చన్. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే కూడా ఉక్కిరి బిక్కిరి అవుతున్నట్టు తెలుస్తోంది. ప్రజల్లో వ్యతిరేకత ఉన్నా... తమ ప్రాంతానికి వచ్చిన ప్రాజెక్ట్ విషయంలో అడుగు ముందుకేయాలా? లేక ప్రజాభీష్టం పేరుతో ఆపేయాలో అర్థంగాక గందరగోళంలో ఉన్నట్టు చెప్పుకుంటున్నారు.

# అమరావతి కోసం వైసీపీ లీగల్ ఫైట్...



అమరావతిలో రాజధాని నిర్మాణం ఒక ఎత్తయితే... అందుకోసం భూములు ఇచ్చిన రైతుల సమస్యలు మరోఎత్తు. ఒకవైపు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుంటే... ఇంకోవైపు రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు, రెండో విడత భూ సమీకరణకు సంబంధించిన సమస్యలు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. సరిగ్గా ఇక్కడే కొత్త అస్త్రాలకు పదును పెడుతోందట ప్రతిపక్ష పార్టీ. బాధిత రైతుల తరపున వైసీపీ డైరెక్ట్‌గా యాక్షన్‌లోకి దిగే ప్రయత్నంలో ఉన్నట్టు తెలుస్తోంది. దానికి సంబంధించి ఆగమేఘాల మీద పార్టీ తరపున ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయడమే ఇందుకు ఉదాహరణ అంటున్నారు పరిశీలకులు. రాజధాని ప్రాంతానికి చెందిన కొందరు రైతులు తాజాగా వైసీపీ అధ్యక్షుడు జగన్‌ను కలిశారు. వాళ్ళు తమ సమస్యల్ని చెప్పిన వెంటనే పార్టీ కమిటీలు ఏర్పాటవడం చూస్తుంటే... ఈ విషయలో విపక్షం ఎంత సీరియస్‌గా ఉందో అర్థమవుతోందని అంటున్నారు ఈ వ్యవహారాలను దగ్గరగా గమనిస్తున్న వాళ్ళు. అమరావతి రైతుల సమస్యల్ని క్షేత్రస్థాయి పరిశీలించడం కోసం పార్టీ తరపున కీలకమైన సీఆర్డీఏ కమిటీ ఏర్పాటైంది. బలవంతపు భూ సమీకరణకు తాము వ్యతిరేకమని.. తాము అధికారంలోకి వచ్చాక అవసరమైతే భూముల్ని తిరిగి ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలిస్తామని జగన్ చెప్పడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ప్రభుత్వం చెబుతున్నట్టు అమరావతిలో అంతా పారదర్శకంగా ఏమీ లేదని, చాలా మందికి తీవ్రమైన అన్యాయం జరుగుతోందన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే వైసీపీ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందని అంటున్నారు. 400 మందికి పైగా రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇంకా కేటాయించాల్సి ఉందని చెప్పుకుంటున్నారు. కొన్ని భూములపై కోర్టు కేసులు కొనసాగుతుండగా.. వాటి పరిష్కారం తర్వాతే ప్లాట్లు కేటాయిస్తామని అంటోందట ప్రభుత్వం. లంక భూములకు సంబంధించిన సమస్యలు కూడా ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదని తెలుస్తోంది. రెండు వేలకుపైగా ప్లాట్లు వివిధ కోర్టు వివాదాల్లో ఉన్నాయనే చర్చ కూడా జరుగుతోంది. ఇలా అధికారికంగా వెలుగులోకి వచ్చిన సమస్యలతో పాటు.. బయటకు రాని ఇబ్బందులు కూడా చాలానే ఉన్నాయని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. కోర్టులకు వెళ్లే స్తోమత లేక.. ప్రభుత్వాన్ని ఎదిరించే ధైర్యం చాలని చాలామంది రైతులు తమ సమస్యలను బయటపెట్టలేకపోతున్నారని వైసీపీ నేతలు గుర్తించినట్లు సమాచారం. అలాంటి వారికి అండగా ఉండి న్యాయ సహాయం అందించడమే లక్ష్యంగా ప్రత్యేక వ్యవస్థను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. కృష్ణా, గుంటూరు జిల్లాల వైసీపీ అధ్యక్షులు పేర్ని నాని, అంబటి రాంబాబులతో పాటు దేవినేని అవినాష్, లేళ్ళ అప్పిరెడ్డి, మొండితోక అరుణ్ కుమార్, నందిగం సురేష్, దొంతిరెడ్డి వేమారెడ్డి, వనమా బాల వజ్రబాబులకు
ఈ కీలక కమిటీలో చోటు కల్పించారు. కోర్టుల్లో పోరాడేందుకు పార్టీ లీగల్ సెల్ నుండి పొన్నవోలు సుధాకర రెడ్డి లాంటి వాళ్ళను కూడా రంగంలోకి దించారు. ఇప్పటివరకు రాజధాని విషయంలో అధికార కూటమి వాదనలే ఎక్కువగా వినిపించాయని, అందుకే రైతుల సమస్యల పేరుతో వైసీపీ ప్రత్యామ్నాయ వేదికను సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. మొదటి విడతలో రిటర్నబుల్ ప్లాట్లు అందని రైతులు, రెండో విడత భూ సమీకరణలో సమస్యలు ఎదుర్కొంటున్న వాళ్ళు, కోర్టుల చుట్టూ తిరగలేని బాధితులు.. ఇలా అన్ని వర్గాల వాళ్ళను సపోర్ట్ చేయడమే ప్రతిపక్ష పార్టీ అజెండాగా కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో అమరావతి రైతులు ఏం కోరుకుంటే అది చేస్తాం.. బలవంతపు భూసేకరణ అనేదే ఉండదు.. అవసరమైతే భూములు వెనక్కు ఇస్తాం. ప్రస్తుతానికి మనం చేయగలిగింది న్యాయ పోరాటం మాత్రమేనన్న జగన్ మాటల చుట్టూ గట్టి చర్చలే జరుగుతున్నాయి. ఇదే సమయంలో తమ మావిగన్ ప్రతిపాదన అయితే అమరావతి ప్రాంత రైతుల నుంచి మరోసారి భూములు తీసుకోవాల్సిన అవసరం ఉండదన్న వాదనను తెరపైకి తెస్తోంది వైసీపీ. మొత్తం మీద అమరావతి రైతుల సమస్యలను కేంద్రంగా చేసుకుని వైసీపీ లీగల్ అస్త్రంతో డైరెక్ట్ వార్ డిక్లేర్ చేసినట్టేనన్నది విస్తృతాభిప్రాయం. భూ సమీకరణ బాధితులకు అండగా నిలవడం ద్వారా రాజధాని పేరుతో ప్రభుత్వానికి వస్తున్న మైలేజీకి బ్రేకులు వేయాలన్నది విపక్షం స్కెచ్‌గా కనిపిస్తోంది. మరి ఈ లీగల్ ఫైట్‌కు రైతులు కలిసి వస్తారా...? కూటమి ప్రభుత్వం ఎలాంటి కౌంటర్ ఉంటుందోనన్న ఆసక్తి పెరుగుతోంది పొలిటికల్ సర్కిల్స్‌లో.

## రాజ్యసభ ఎన్నికల కోసం పక్కా వ్యూహం

**విజయవాడ,జూన్ 8,** ఏపీలో రాజ్యసభ లెక్క తేలింది. టిడిపి నుంచి ముగ్గురు.. జనసేన నుంచి ఒకరు ఖరారు అయ్యారు. టిడిపి నుంచి సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ పేరు ఖరారు చేశారు. టిడిపి అధినేత చంద్రబాబు రాజ్యసభ ఎన్నికలో పక్కా వ్యూహం అమలు చేసినట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణలు, ప్రాంతాలవారీగా బ్యాలెన్స్ చేయడం, పార్టీకి ఉన్న నమ్మకమైన కేడర్ కు ప్రాధాన్యత ఇవ్వడం అనే అంశాల ఆధారంగా ఈ ముగ్గురి ఎంపిక జరిగింది. కాపు బీసీ సామాజిక వర్గాలకు ప్రాధాన్యమిస్తూనే.. విద్యారంగంలో గుర్తింపు ఉన్న వ్యక్తులకు, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన యువనాయకత్వానికి ఈసారి పెద్దపీట వేశారు. బిజెపి, జనసేన నాయకత్వంతో మాట్లాడిన తర్వాత మాత్రమే తుది నిర్ణయం తీసుకున్నారు. ముగ్గురు ఎంపిక వెనుక పార్టీ పట్ల విధేయత దాగి ఉంది. ముఖ్యంగా ముగ్గురు నారా లోకేష్ కు అత్యంత సన్నిహితులు కావడం విశేషంసానా సతీష్ కు మరోసారి కొనసాగింపు లభించింది. గత కొంతకాలంగా పార్టీలో ఆయన క్రియాశీలకంగా ఉన్నారు. పారిశ్రామిక వ్యాప్తంగా కూడా గుర్తింపు ఉంది. నిత్యం నారా లోకేష్ వెంట ఉండేవారు. ఆయన పాదయాత్ర చేసిన సమయంలో కూడా కీలకంగా వ్యవహరిస్తూ వచ్చారు. భాష్యం రామకృష్ణ తెర వెనుక రాజకీయ సేవలు అందిస్తూ వచ్చారు. టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా సహకారం అందించారు. మొన్నటి ఎన్నికల్లో గుంటూరు ఎంపీ టికెట్ ఆశించారు. కానీ వీలు పడలేదు. రాజ్యసభ పదవి దక్కింది. ఇక చింతకాయల విజయ్ గురించి చెప్పనవసరం లేదు. తండ్రి మాదిరిగానే దూకుడు కలిగిన నేత. ఐటీడీపీకి విశేష సేవలు అందించారు. ఆయనకు రాజ్యసభ పదవి ఇవ్వడం ద్వారా యువతకు, పార్టీ నమ్మకస్తులకు చంద్రబాబు సరైన గుర్తింపు ఇచ్చారని చర్చ జరుగుతోందిఈ ముగ్గురి ఎంపిక వెనుక ఉన్న అసలు వ్యూహం లోకేష్. పార్టీలో యువతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. మొన్న పొలిట్ బ్యూరోతో పాటు అన్ని రకాల కార్యవర్గాల్లో యువతను నియమించారు. ఇప్పుడు రాజ్యసభలో సైతం ఈ ముగ్గురు యువ నాయకులను తీసుకున్నారు. పార్టీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ కీలక నియామకం చేపట్టారు. ఉత్తరాంధ్ర నుంచి విజయ్ ను తీసుకోవడం విశేషం. బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు కావడం, యువనేత కావడంతో చివరి నిమిషంలో ఆయన వైపు మొగ్గు చూపారు చంద్రబాబు. మొత్తానికి అయితే సుదీర్ఘ కసరత్తు తరువాత చంద్రబాబు రాజ్యసభ సభ్యులను ఎంపిక చేయడం విశేషం.

## కర్నూలులో వైసీపీ వర్సెస్ వైసీపీ

**కర్నూలు,జూన్ 8, :** కర్నూలులో అధికార పార్టీ, ప్రతిపక్షం పోరు కాస్త..వైసీపీ వర్సెస్ వైసీపీ అన్నట్టు మారిపోయింది. టీడీపీలోని ఒక వర్గం పరోక్షంగా ప్రతిపక్ష నేతల మధ్య మంట పెట్టిందనే ప్రచారం జరుగుతున్న వేళ..కర్నూలు వైసీపీలో అంతర్గత పోరు వీధికెక్కుతోంది. ఏకంగా సోషల్ మీడియా వేదికగా నాయకులు దుమ్మెత్తి పోసుకోవడం హాట్ టాపిక్ అవుతుంది. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, వైసీపీ కర్నూలు నగర అధ్యక్షుడు అహ్మద్ అలీ ఖాన్ మధ్య సోషల్ మీడియా వార్ ఒక రేంజ్‌లో నడుస్తోంది. వచ్చే ఎన్నికల్లోనూ కర్నూలు సీటు మైనారిటీకి వెళ్తుందని ఎస్వీ మోహన్ రెడ్డి కుట్ర చేస్తున్నారని.. టీడీపీ కన్న వైసీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ వర్గం తనపై కక్ష కట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు అహ్మద్ ఖాన్వారం పది రోజుల క్రితం కర్నూలు వేదికగా రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఎస్వీ మోహన్ రెడ్డి, బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి మధ్య మాటలు మంటలు చెలరేగాయి. అవి అలా చల్లారాయో లేదో ఇప్పుడు వైసీపీలో అంతర్గత పోరు కాక రేపుతోంది. పార్టీ కర్నూలు నగర అధ్యక్షుడు అహ్మద్ అలీఖాన్ ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడితో, ఎస్వీ మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా ఫోన్‌లో మాట్లాడిన మాటలు ఇప్పుడు బయటికి వచ్చాయి. వాయిస్ రికార్డ్ చేసిన ఐటీడీపీ ప్రతినిధి దాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అంతకు ముందు కర్నూలులో ఎస్వీ మోహన్ రెడ్డి, జక్కంపూడి రాజా, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి చేసిన ఆందోళన విషయంలో కూడా అహ్మద్ ఖాన్ ఎస్వీకి వ్యతిరేకంగా కామెంట్స్ చేశారు. ఆయన వైసీపీలో వెనుకబడ్డారని, దాన్ని నిలబెట్టుకోడానికి నానా తంటాలు పడుతున్నాడని అహ్మద్ ఖాన్ అన్నట్లుగా చెబుతున్నారు.కర్నూలులో వైసీపీ చేపట్టిన ఆందోళనలో జక్కంపూడి రాజా, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మాత్రమే హైలైట్ అయ్యారంటూ ఐటీడీపీ ప్రతినిధితో ఫోన్ కన్వర్జేషన్‌లో మాట్లాడారు వైసీపీ నగర అధ్యక్షుడు అహ్మద్ ఖాన్. ఎస్వీ మోహన్ రెడ్డి వన్ మ్యాన్ షో చేస్తున్నారంటూ సొంత పార్టీ నేతపై నెగెటివ్ కామెంట్స్ చేశారాయన. సరిగ్గా ఈ పాయింట్స్‌నే తమకు అనుకూలంగా మల్చుకునేందుకు టీడీపీ వ్యూహాలు రచిస్తోంది. వైసీపీలో అంతర్గత విభేదాలు గట్టిగా ఉన్నాయని ప్రొజెక్ట్ చేస్తూ..ఆడియో రికార్డ్‌ను పోస్ట్ చేసింది టీడీపీ సోషల్ మీడియా టీమ్. ఇదే ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలో మంటలు పుట్టిస్తోంది. పార్టీ జిల్లా అధ్యక్షుడికి వ్యతిరేకంగా కర్నూల్ నగర అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలతో క్యాడర్లో అయోమయ పరిస్థితి ఏర్పడింది. అటు ఎస్వీకి చెందిన సోషల్ మీడియా టీమ్ కూడా అహ్మద్ అలీఖాన్ పేరు ప్రస్తావించకుండా కొన్ని పోస్టులు పెట్టడం కలకలం రేపుతోంది. మరికొందరు సోషల్ మీడియాలోనే అహ్మద్ అలీఖాన్‌ను నిలదీస్తున్నారు.కర్నూలు వైసీపీలో ముగ్గురు కీలక నేతలు యాక్టివ్‌గా పనిచేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్ రెడ్డి, హఫీజ్ ఖాన్, నగర అధ్యక్షుడు అహ్మద్ అలీఖాన్ మూడు గ్రూప్‌లు విడిపోయి యాక్టివిటీ నడిపిస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్ళు హఫీజ్ ఖాన్, ఎస్వీ మోహన్ రెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా పోరు మాత్రం ఆగడం లేదు. అది చాలదన్నట్లుగా అహ్మద్ ఖాన్ వాయిస్ రేజ్ చేయడంతో పాటు ఆయన ఆడియో కాల్ టీడీపీ సోషల్ మీడియా టీమ్‌కు చిక్కడం మరింత చర్చనీయాంశంగా మారింది. రాయలసీమకు ముఖద్వారంగా ఉన్నా కర్నూలు వైసీపీలో నడుస్తున్న అంతర్గత పోరుపై పార్టీ అధిష్టానం ఎలా రియాక్ట్ అవుతుందో వేచి చూడాలి మరి.

## సైలెంట్ మూడ్ లోకి ఫైర్ బ్రాండ్లు

**కడప,జూన్ 8,** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఒక వింత వాతావరణం కొనసాగుతోంది. ఎవరి వల్ల పార్టీకి చెడ్డ పేరు వచ్చిందో.. వారు ఇప్పుడు యాక్టివ్ అవుతున్నారు. పార్టీలో సీనియర్లు సైలెంట్ అవుతున్నారు. ఈ భిన్న వాతావరణంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది. 2019 నుంచి 2024 మధ్య కొంతమంది నేతల వ్యవహార శైలితోనే పార్టీకి ఈ రకమైన ఇబ్బందులు వచ్చాయి. ప్రారంభంలో వారి మాటలు గొప్ప ఫ్యాషన్ గా అనిపించాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను సైతం ఆకర్షించాయి. కానీ రాను రాను ఆ నేతల తీరుతోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పతనస్థితికి చేరుకుందనేది పార్టీ క్యాడర్ కు తెలిసింది. పార్టీలో సీనియర్లు మౌనం వహించి.. దూకుడు కలిగిన నేతలు మాటలు పార్టీకి చేటు తెచ్చాయి అని ఆలస్యంగా తెలిసింది. అప్పటికే మూల్యం చెల్లించుకుంది పార్టీ. అయితే ఇప్పుడు క్యాడర్ తెలుస్తుంది కానీ.. నాయకత్వం తెలుసుకోకపోవడం పార్టీకి లోటు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫైర్ బ్రాండ్లుగా గుర్తింపు సాధించారు కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్, పేర్ని నాని, అంబటి రాంబాబు, ఆర్కే రోజా, జోగి రమేష్, గుడివాడ అమర్నాథ్, సిదిరి అప్పలరాజు.. ఇలా చెప్పుకుంటూ పోతే చాలామంది జూనియర్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడే వారు. వారి మాటలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఎంతో ఇష్టంగా ఉండేవి. అయితే వారి మాటలు తటస్థులతోపాటు విద్యాధికులపై విపరీతంగా ప్రభావం చూపించాయి. దాని ఫలితమే 2024 ఎన్నికల్లో దారుణ పరాజయంవైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చేటు తెచ్చిన ఆ దూకుడు నేతలను జగన్మోహన్ రెడ్డి పక్కన పెట్టినట్లు కనిపించారు ప్రారంభంలో. గత అనుభవాల దృష్ట్యా సీనియర్ల సేవలను వినియోగించుకుంటానని జగన్ చెప్పుకొచ్చారు. అందుకు తగ్గట్టుగానే సీనియర్లుగా ఉన్న ధర్మాన, బొత్స లాంటి నేతలు మాట్లాడడం ప్రారంభించారు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వచ్చాయని అంతా భావించారు. కానీ ఆ సరదా ఆ సంతోషం ఎన్నో రోజులు నిలవలేదు. ఎవరైతే బూతులు మాట్లాడారో.. అడ్డగోలుగా వ్యవహరించారో.. అటువంటి నేతలు మళ్లీ తెరపైకి వస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి వారికి ప్రాధాన్యమిస్తున్నట్టు కనిపిస్తున్నారు. దీంతో సీనియర్లుగా ఉన్న ధర్మాన లాంటి వారు మళ్లీ మౌనం పాటిస్తున్నారు. ఇలా అయితే కష్టమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిట్టూరుస్తున్నారు.

## దేవీపట్నం మండలంలో కొనసాగుతున్న పులి సంచారం

**ఏలూరు: :** దేవీపట్నం మండలం నెలకోట ఒ పూడిపల్లి సొరంగం వద్ద పులి సంచారం కొనసాగుతోంది. అటవీశాఖ, హనుమాన్ ప్రత్యేక బృందాలు రాత్రంతా నిఘా కొనసాగించాయి. క్షేత్రస్థాయిలో బృందాలకు ఉన్నతాధికారులు మార్గనిర్దేశం చేస్తున్నారు. లి బెంగళూరు నుంచి వచ్చిన వన్యప్రాణి నిపుణుల బృందం ఆపరేషన్ లో భాగస్వామ్యమైయింది. రాత్రివేళ బయటకు ఒంటరిగా వెళ్లొద్దని గ్రామస్తులకు అటవీశాఖ అధికారులు సూచించారు.

## విశాఖలో యువకుడి దారుణ హత్య

**విశాఖపట్నం:** విశాఖపట్నం మురళీ నగర్ మసీదు సెంటర్ సమీపంలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. నడిరోడ్డుపై కత్తులతో దాడి జరిగింది. బాధితుడు కేజీహెచ్ లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పాత కక్షల నేపథ్యంలో సాలిపేటకు చెందిన వరుణ్ ( 35 ) హత్య కు గురైయాడు. నిందితులు పరారీలో వున్నారు. పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్ఆరు. కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

# గ్రేటర్‌లో టీడీపీ పోటీ...



**హైదరాబాద్ :** ఎన్నికల్లో టిడిపి పోటీ చేసేందుకు సమాయత్తం అవుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బీజేపీని ఉద్దేశించి టిడిపి అక్కడ యాక్టివ్ అయ్యేందుకు అన్ని సన్నాహాలు చేసుకుంటున్నట్లు సమాచారం. తెలంగాణలో తెలుగుదేశం పార్టీలో పని చేసిన నేతలంతా ఇప్పుడు చంద్రబాబుకు టచ్ లోకి వస్తున్నట్లు సమాచారం. పార్టీని యాక్టివ్ చేస్తే చేరేందుకు సిద్ధంగా ఉన్నామని వారు తమ ప్రతిపాదనను చంద్రబాబు ఎదుట పెట్టినట్లు ప్రచారం సాగుతోంది. అయితే మారిన పరిస్థితుల నేపథ్యంలోనే తెలంగాణపై ఫుల్ ఫోకస్ పెట్టారట చంద్రబాబు. ప్రస్తుతం అక్కడ పార్టీకి నాయకత్వం లేదు కానీ.. క్యాడర్ ఇప్పటికీ కొనసాగుతోంది. టిడిపి అభిమానులు కూడా ఎక్కువే. గ్రేటర్ తో పాటు సెటిలర్స్ ఉన్న జిల్లాలు చాలా ఉన్నాయి. అటువంటి చోట్ల మాత్రం టిడిపి పేరు ప్రముఖంగా వినిపిస్తూనే ఉంటుంది.మొన్న తెలంగాణలో పర్యటనకు వచ్చారు ప్రధాని నరేంద్ర మోడీ. దాదాపు పదివేల కోట్ల రూపాయల నిర్మాణాలకు సంబంధించి హైదరాబాదులో శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు తో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇంటికి వెళ్లారు. చంద్రబాబుతో అయితే గంటల తరబడి చర్చించారు. అయితే దీని వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు అప్పట్లోనే వార్తలు వచ్చాయి. ఏపీలో ఎన్డీఏ కూటమి నడుస్తోంది మూడు పార్టీలతో. తెలంగాణలో సైతం మూడు పార్టీలు ఏకతాటి పైకి వస్తే బాగుంటుంది అనే అభిప్రాయం ఉంది. అయితే గతంలో మాదిరిగా ప్రత్యేక రాష్ట్ర భావన లేదు. ఇప్పుడు అంతా అభివృద్ధి అజెండాగా సాగుతోంది తెలంగాణ రాజకీయం. తెలుగుదేశం పార్టీని యాక్టివ్ చేసేందుకు ఇదే సరైన సమయం అని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర పెద్దల ఆదేశాలతో గ్రేటర్ ఎన్నికల్లో మూడు పార్టీల మధ్య పొత్తు ఉండబోతుందనేది ఒక అంచనాతెలుగుదేశం పార్టీకి తెలంగాణలో బలమైన కేడర్ ఉంది. ఎందుకంటే ఆ పార్టీ పుట్టింది తెలంగాణలో. ఎన్టీఆర్ బలమైన పునాదులు ఏర్పాటు చేశారు. అవి తెలంగాణలో ఎక్కువగా నాటుకున్నాయి కూడా. మధ్యలో ప్రత్యేక రాష్ట్రం వాదంతో తెలుగుదేశం కాస్త ఇబ్బంది పడింది. ప్రతి దానికి చంద్రబాబు బూచి ని చూపించి రాజకీయం చేశారు. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించి పుష్కరకాలం దాటుతున్న క్రమంలో క్రమేపి ప్రాంతీయ వాదం బలహీనపడుతోంది. అభివృద్ధి మంత్రం పతాక స్థాయికి చేరుకుంటుంది. అందుకే ఏపీ మాదిరిగా తెలంగాణలో సైతం ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు కలిసి నడుస్తాయన్న ప్రచారం జరుగుతోంది.తెలంగాణలో ప్రస్తుతం అన్ని పార్టీల్లో ఉన్న నాయకులు ఎక్కువగా టిడిపి నుంచి వెళ్లిన వారి. గులాబీ పార్టీలో అయితే ఆ పార్టీ బాస్ కెసిఆర్ నుంచి దిగువ స్థాయి కేడర్ వరకు అంతా టిడిపి దే. కాంగ్రెస్ పార్టీలో కూడా మెజారిటీ నాయకత్వం టిడిపి నుంచి వెళ్ళింది. అయితే ఇప్పుడు గులాబీ పార్టీ పరిస్థితి బాగా లేకపోవడంతో.. ఆ పార్టీలో ఉన్న పూర్వపు టిడిపి నేతలు అంతా పూర్వాశ్రమం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారట. తెలంగాణలో తెలుగు దేశం పార్టీని యాక్టివ్ చేస్తే చేరేందుకు సిద్ధమవుతున్నారట. ఇప్పటికే చంద్రబాబుకు చాలామంది టచ్లోకి వచ్చారట. సరైన సమయం చూసి చెబుతానని బాబు చెప్పారట. చూడాలి మరి ఈ ప్రచారంలో నిజం ఎంత ఉందో

# యారన్.. యాతన..

## సిరిసిల్లలో కాకుండా వేములవాడలో నూలు డిపో!



**రాజన్న సిరిసిల్ల :** కాంగ్రెస్ పాలనలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఆగమవుతున్నది. బతుకమ్మ చీరలను బంద్ పెట్టిన ప్రభుత్వం, ఇప్పుడు నూలు అందించడంలోనూ నిర్లక్ష్యం చూపుతున్నది. వస్త్ర పరిశ్రమకు కేంద్రమైన సిరిసిల్లలో కాకుండా.. వేములవాడలో టెస్కో ఆధ్వర్యంలో యారన్ డిపో (నూలు బ్యాంక్) ఏర్పాటు చేయడంతో అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. యారన్ సమయానికి అందివ్వక పోవడంతోపాటు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో వస్త్రోత్పతి నిలిచిపోతు న్నది. దీంతో వస్త్రోత్పత్తిదారులు, మ్యాక్స్ సొసైటీల నిర్వాహకు లు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది.దీని ప్రభావం నేతన్నలపై పడి ఉపాధి దెబ్బతింటున్నది.తాజా తెలుగు వార్తలు

**కాంగ్రెస్ హయాంలో అందని యారన్**

నేతన్నలున్న సిరిసిల్లలో కాకుండా ప్రభు త్వ విప్ ఆది శ్రీనివాస్ నియోజకవర్గం వేములవాడలో ప్రభుత్వం యారన్ డిపో ఏర్పాటు చేసింది. మరమగ్గాలు, చేనేత సహకార సం ఘాల కోసం పెట్టిన ఈ డిపోను టెస్కో నిర్వహిస్తున్నది. దీన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించడం గమనార్హం. ప్రభుత్వ ఆర్డర్లకు 10 శాతం చెల్లింపుతో, 90శాతం క్రెడిట్‌పై యార న్ అందించడం ఈ డిపో ఉద్దేశం. 90శాతం క్రెడిట్‌ను బిల్లులు విడుదలయ్యాక, వాటిని ఆ బిల్లులో కట్ చేసుకొని, మిగతా బిల్లులను నే తన్నలకు చెల్లించాలి. డిపోను వేములవాడలో ఏర్పాటు చేయడం, సకాలంలో యారన్ ఇవ్వకపోవడంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మ్యాక్స్ సొసైటీ నిర్వాహకులు, యజమానులు, ఆసాములు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యారన్ కోసం డీడీలు కట్టి వేచిచూడాల్సి వ స్తున్నదని, రవాణా భారం అదనంగా పడుతున్నదని వాపోతున్నారు. నూలు సాయం సమయానికి అందక, బయట అధిక ధరలు పెట్టలేక ఆర్డర్ల వస్త్రోత్పత్తికి తీవ్ర విఘాతం కలుగుతున్నదం టున్నారు. పెట్టుబడి సైతం లేక ఆసాములకు లబ్ధి చేకూరకుం డా పోతున్నదని వి చారం వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వ అప్పులు

**నిలిచిన వస్త్రోత్పత్తి**

ప్రభుత్వ ఆర్డర్లు ఖరారయ్యాక టెస్కో ఆధ్వర్యంలో నూలు కొనుగోలుకు టెండర్లు పిలుస్తారు. అందులో అవకాశం దక్కించుకున్న సంస్థల ప్రతినిధులు మాత్రమే యారన్ డిపోకు నూలు సరఫరా చేస్తున్నారు. వస్త్రోత్పత్తిదారులు తయారు చేసిన వస్త్రాన్ని టెస్కోకు అందిస్తే, యారన్ 90 శాతం బిల్లును మినహాయించుకొని మిగతా డబ్బులను తిరిగి చెల్లిస్తుంది. ఇప్పటివరకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతోపాటు ఇటీవల మళ్లీ ఇందిర మహిళా శక్తి చీరల ఆర్డర్లు ఇచ్చినప్పటికీ యారన్ ఇవ్వకపోవడంతో చీరల తయారీ నిలిచిపోయింది. మే నెలలో ఆర్డర్లు ఇచ్చిన సర్కార్ జూలై 31వరకు గడువు ఇచ్చింది. ఇప్పటివరకు సరిపడా నూలు అందకపోవడంతో వస్త్రోత్పత్తిదారులు, మ్యాక్స్ సొసైటీల నిర్వాహకులు దిక్కులు చూస్తున్నారు. ఇదిలావుండగా యారన్ డిపోలో యారన్ కిలోకు అధికంగా రూ.30 వరకు ధర ఉండటంతో కొందరు యజమానులు ఇతర మార్కెట్లలో కొనుగోలు చేసి వస్త్రోత్పత్తి చేస్తున్నారు. కానీ, చిన్న, మధ్య తరహా ఆసాములు యారన్ అందక చీరల తయారీని చేయలేకపోతున్నారు. నూలు బ్యాంక్ ఏర్పాటు చేసినప్పటికీ సిరిసిల్ల నేతన్నలకు ఎలాంటి ఉపయోగం లేకపోవడంతో యారన్ బ్యాంక్ నిరుపయోగంగా మారింది. ప్రభుత్వ ఆర్డర్లకే యారన్ డిపో నుంచి నూలు అందించాల్సి ఉన్నా.. అది కూడా అందుబాటులో లేదు. బహిరంగ మార్కెట్‌లో యారన్ రేటు అమాంతం పెరుగడం, యారన్ డిపో నుంచి నూలు అందకపోవడంతో వస్త్రోత్పత్తి ముందుకు సాగడం లేదు.

**కేసీఆర్ హయాంలో సిరులఖిల్లాగా..**

కేసీఆర్ పాలనలో అప్పటి చేనేత, జౌళిశాఖ మంత్రి కేటీఆర్ కృషితో సిరిసిల్ల సిరులఖిల్లాగా మారింది. ఎన్నో సంక్షేమ పథకాలు, రుణాలు, చేతినిండా పనితో నేతన్నలకు భరోసా దొరికింది. ప్రభుత్వ ఆర్డ ర్లు, బతుకమ్మ చీరల తయారీతో వస్త్ర పరిశ్రమ కళకళలాడింది. బతుకమ్మ చీరలకు సైతం నేతకార్మికులకు 10శాతం యారన్ సబ్సిడీని అందించింది. కార్మికుడు నేసిన ప్రతిమీటర్ బట్టకూ రూ.1.42 పైసలు అందించి అండగా నిలిచింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారింది. ప్రభుత్వం నేతన్నలపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నది. వచ్చీ రాగానే కేటీఆర్‌పై అక్కసుతో ప్రభుత్వ ఆర్డర్లు, బతుకమ్మ చీరల తయారీని నిలిపివేసింది. ఏడాదిన్నరపాటు పనులు లేక తీవ్ర ఇబ్బందుల్లో పరిశ్రమ సంక్షోభంలో చిక్కింది. ఆర్థిక ఇబ్బందులు, చేతినిండాపనులు లేకపోవడంతో సుమారు 15 మంది నేతకార్మికులు సైతం ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ పరిస్థితుల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కార్మిక సంఘాల నాయకులు ఒత్తిడి, నేతల ఆందోళనలతో ప్రభుత్వం అనివార్యంగా అరకొర ఆర్డర్లు ఇచ్చింది. ఇందిరా మహిళా శక్తి ఆర్డర్లు అందించింది. రూ.50 కోట్ల కార్పస్ ఫండ్‌తో ప్రభుత్వ ఆర్డర్లకు నూలు సాయం అందించేందుకు 2024 నవంబర్‌లో వేములవాడలో తెలంగాణ రాష్ట్ర చేనేత, మరమగ్గాల పారిశ్రామికుల సహకార సంఘం లిమిటెడ్ (టెస్కో) ఆధ్వర్యంలో యారన్ డిపోను సైతం ఏర్పాటు చేసింది. ఏడాది గడిచిందో లేదో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఇచ్చిన ప్రభుత్వ ఆర్డర్లను రద్దు చేసింది. కమీషన్లకు కక్కుర్తిపడి టెండర్ల ద్వారా వస్త్రాల సేకరణ చేసేందుకు మొగ్గుచూపింది. ఇటీవలే మళ్లీ రెండో విడత ఇందిరా మహిళ శక్తి చీరల తయారీ ఆర్డర్లను ఇచ్చింది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఇచ్చిన ఆర్డర్లకు యారన్ డిపో నుంచి నూలు అందక, చీరల తయారీ సందిగ్ధంలో పడింది. మొదటి విడత అందించిన చీరల తయారీ ఈ ఏడాది జూలై 31 వరకు పూర్తి చేయాల్సి ఉన్నా నూలు సాయం అందక ఉత్పత్తి ముందుకుసాగడం గగనంగా మారింది.

## బడిలో అడ్మిషన్ తీసుకున్న వారికి మొక్క అందజేత.. పిట్టల ఎల్లయ్యపల్లెలో వినూత్నంగా బడిబాట

**ఓదెల :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పిట్టల ఎల్లయ్య పల్లె గ్రామంలో సోమవారం బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు వినూత్నంగా నిర్వహించారు. ఇక్కడ గ్రామంలో ఇంటింటికి తిరిగిన ఉపాధ్యాయులు బడిలో చేర్పించిన విద్యార్థి తల్లిదండ్రులకు ఒక మొక్కను బహుకరించారు. ఇందువల్ల ప్రభుత్వ బడి బలోపేతం అవడంతో పాటు ఇంటిలో పచ్చని మొక్క ఆహ్లాదంగా ఉండటంతో చక్కని గాలి దొరకనుందన్నారు. ఈ వినూత్న కార్యక్రమంతో ఇక్కడి ఉపాధ్యాయులు ముందుకు వెళ్లడాన్ని పలువురు అభినందిస్తున్నారు. గ్రామస్తులో కూడా హర్షం వ్యక్తమవుతోంది. బడిబాటలో భాగంగా బడీడు పిల్లల ఇండ్లను సందర్శించి ప్రీ ప్రైమరీ నుండి ఐదో తరగతి వరకు అడ్మిషన్స్ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తౌటం సంతోష్, ఉపాధ్యాయురాలు సుమలత, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## నిలోఫర్‌లో వైద్యులు నిరసన

**హైదరాబాద్ :** నిలోఫర్ ఆస్పత్రిలో పీజీ వైద్యుడిపై రోగి సహాయకుడి దాడి చేయడాన్ని నిరసిస్తూ, పీజీ వైద్యులు విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. మూడు రోజులక్రితం డాక్టర్స్ పై దాడి జరిగినా అధికారులు, పోలీసులు పట్టించుకోలేదని వారన్నారు. పిజి విద్య విద్యార్థులపై రోగి సహాయకులు దాడి చేయడాని నిరసిస్తూ...దాడి చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతున్న బాలికను ఆసుపత్రికి తీసుకొచ్చారు. వచ్చిన మొదటి రోజునుండి బాలిక తాలూకు కుటుంబసభ్యులు ఐసీయూలో పదుల సంఖ్యలో వచ్చి తీవ్ర ఇబ్బందులు పెట్టారు. శని వారం అర్ధరాత్రి రోగి సహాయకుడు ఐసీయూలోకి వచ్చి వాగ్వాదం చేసి డాక్టర్ పై రోగి సహాయకుడు దాడికి దిగారు. వెంటనే స్పీఎఫ్ పోలీసులకు పిర్యాదు చేసారని అన్నారు. ఎస్పిఎఫ్ పోలీసులు డాక్టర్స్ కు కాకుండా దాడికి పాల్పడిన వారికే మద్దత్తు పలకడానికి పిజి వైద్యులు తీవ్రంగా ఖండించారు నాంపల్లి పోలీసులకు పిర్యాదు చేసిన ...అప్పటికి పోలీసులు పట్టించుకోకపోవడం తో పిజి వైద్యులు వీధులు బహిష్కరించి ఆందోళ చేపట్టారు.

## బోల్లారం లో చైన్ స్నాచింగ్

**మేడ్చల్ :** బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో తెల్లవారుజామున చోరీ కలకలం రేపింది. చింతల బజార్ గంగపుత్ర సంఘం వెనుక కాలనీలో ఘటన జరిగింది. ఇంటి ముందు వాకిలి ఊడుస్తున్న మహిళపై దుండగుడి దాడి జరిగింది. ముఖంపై మత్తు పౌడర్ చల్లి బంగారు పుస్తెలతాడు అపహరణ జరిగింది. బాధితురాలు రాంప్రసాద్ భార్య.. సుమారు 7 తులాల బంగారం చోరీ అయింది. సమాచారం అందుకున్న వెంటనే బొల్లారం పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దుండగుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## తమను దూషించిన వారు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి.

**కార్మికులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి.**

**లేనిపక్షంలో రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం.**

తమను దూషించిన సెంట్రింగ్ కార్మిక సంఘాల పై చర్యలు తీసుకోవాలంటూ మేడ్చల్ జిల్లా ఘట్కేసర్‌లో భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో ఆగ్రహం వ్యక్తమైంది. పోచారం పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో కార్మికులు సోమవారం భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. నిర్మాణ రంగంలో రక్తాన్ని చెమటగా మార్చే కార్మికులను దళారీలు, మోసగాళ్లు అంటూ సెంట్రింగ్ కార్మిక సంఘాలు చేసిన అనుచిత వ్యాఖ్యలపై కార్మిక లోకం భగ్గుమంది.భవన నిర్మాణ కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడితే సహించేది లేదని మేస్త్రీల సంఘం నేతలు హెచ్చరిస్తున్నారు. ఘట్కేసర్ సర్కిల్, 8వ డివిజన్ పోచారం పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో సోమవారం ఉదయం నుంచే వాతావరణం వేడెక్కింది. తమను దుర్భాషలాడిన సెంట్రింగ్ సంఘాల వారికి వ్యతిరేకంగా కార్మికులు రోడ్లపైకి వచ్చి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా రాజీవ్ గృహకల్ప కాలనీ భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీల సంఘం అధ్యక్షుడు తిరుమలయ్య మాట్లాడుతూ... రాత్రింబవళ్లు కష్టపడి భవనాలు నిర్మించే కార్మికులను కొందరు నోటికొచ్చినట్లు దూషించడం దారుణమన్నారు.ఈ నిరసన కేవలం కాలనీకే పరిమితం కాదని, రాష్ట్ర రాజధాని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న మహా ధర్నాకు మద్దతుగా ఈ ర్యాలీ చేపట్టామని నేతలు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మేస్త్రీల సంఘం పెద్దలు, కార్మిక సంఘాల నేతల సూచనల ప్రకారం... న్యాయం జరిగే వరకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, అవసరమైతే నిర్మాణ పనులన్నింటినీ బంద్ చేసి నిరసనను ఉధృతం చేస్తామని కార్మిక నేతలు ఘాటుగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అవునా నిర్మాణ కార్మికుల మేస్త్రి సంఘం ఉపాధ్యక్షుడు కీల భాస్కర్, ప్రధాన కార్యదర్శి మద్దూరి శ్రీను, కోశాధికారి ఈ. ఉపేందర్, ప్రచార కార్యదర్శి ఎం. శేఖర్ మరియు కమిటీ సలహాదారులు ఎస్.కె. ఆలీ భాయ్, సైదులు, డి.వి. కృష్ణ మరియు భవన నిర్మాణ కార్మికులు మేస్త్రిలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అత్యాధునిక సౌకర్యాలతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**

లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన్ ప్రాంగణంలో అత్యాధునిక సౌకర్యాలతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ.110 కోట్లు కేటాయించగా, అందులో తొలి విడతగా రూ.50 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. సోమవారం అంబేద్కర్ భవన్‌ను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలాతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు పది అంతస్తుల్లో నిర్మించనున్న ఈ నాలెడ్జ్ సెంటర్ నిరుపేద విద్యార్థులకు ఉన్నత స్థాయి శిక్షణ అందించే కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని భట్టి తెలిపారు. ఇందులో శిక్షణ తరగతులు, ఆధునిక డిజిటల్ లైబ్రరీ, వివిధ దేశాల నుంచి వచ్చే ప్రతినిధులతో సెమినార్లు, చర్చా కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులు, యువతకు విజ్ఞానాన్ని పంచుతామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోనూ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యా, ఉపాధి అవకాశాల విస్తరణకు ఈ కేంద్రాలు దోహదపడతాయని అన్నారు.అదే విధంగా, నింబోలి అడ్డలోని ఎస్సీ హాస్టల్‌ను ఆధునికీకరిస్తున్నామని, దానికి "బాబు జగ్జీవన్ రామ్ భవన్"గా నామకరణం చేయనున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## శంకర విద్యాలయ స్కూల్ తొలగించాలి.

శక్తి సాయి నగర్ లో శంకర విద్యాలయ స్కూల్ ఏ యూనిట్ ఆఫ్ శాండిల్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్కూల్ ను తక్షణమే కాలనీ నుంచి తొలగించాలని శక్తి సాయి నగర్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం శంకర విద్యాలయ స్కూల్ ఎదుట కాలనీవాసులు పెద్ద ఎత్తున చేరి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు మాట్లాడుతూ గత ఆరు నెలల నుంచి స్కూలు ఇక్కడ ఏర్పాటు చేయొద్దని పోరాటాలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ క్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారి డీఈఓ, మండల అధికారి ఎంఈఓ కు సైతం ఫిర్యాదులు చేసినట్లు వివరించారు. తాము ఎన్ని ఫిర్యాదు చేసినా కూడా అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. స్కూల్ ని ఇక్కడ ఏర్పాటు చేయడం వల్ల కాలనీవాసులకు పెద్ద ఎత్తున ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. కాలనీలో రెసిడెన్షియల్ అనుమతి తీసుకొని నిర్మించిన భవనంలో కమర్షియల్ గా స్కూల్ ఏర్పాటు చేయడం కూడా చట్ట విరుద్ధమని దీనిపైన కూడా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే స్కూలును కాలనీ నుంచి తీసివేయాలని లేనియెడల పెద్ద ఎత్తున కాలనీవాసులు అందరం నిరసన కార్యక్రమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

## నిరుద్యోగులతో చెలగాటమాడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

**హైదరాబాద్ :** సిపిఎం ఆధ్వర్యంలో రెండు రోజుల యువజన సమ్మేళనం జరగనుంది. ఈ నెల 16, 17 తేదీల్లో కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ హాలులో యువజన సమ్మేళనం జరగనుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. కక్రోజ్ పార్టీ పేరుతో యూత్ నిరసన వ్యక్తం చేస్తుంది. ఈ సమ్మేళనంలో యువజన సమస్యలపై చర్చించడంతోపాటు భవిష్యత్తు కార్యచరణ. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువత భవిష్యత్ పై దృష్టి పెట్టటడంలేదు. ప్రభుత్వం రంగంలో 60లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఏడాదికి 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇవ్వలేదు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేటు పరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయి. రైల్వేస్ లో 10లక్షల ఖాళీలు ఉన్నాయి. రాజీవ్ యువ వికాసం ప్రకటించి దానికి నిధులు కేటాయించటం లేదు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. ఎస్సీ ఎస్టీసంక్షేమం నిర్వీర్యం అయ్యాయని ఆయన ఆరోపించారు..

## సంపాదకీయం

# 'బొద్దింకల' కడుపుమంట!


ప్రపంచంలో ఐదొవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ పేరు తెచ్చుకుంటున్నా, తలసరి స్థూల దేశీయోత్పత్తిలో మాత్రం 147వ స్థానమే. ఇది దేశంలో అభివృద్ధి ఎంతమందికి చేరుతుందో చెప్పే నిష్ఠుర సత్యం! జీడీపీ గణాంకాలు పైకెళ్తున్నా.. సాధారణ పౌరుల జేబులకు చేరడం లేదన్న వాస్తవం ఇప్పుడు వీధుల్లోకొచ్చింది... ఢిల్లీలో 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరిట రాజధాని వీధులకెక్కిన యువతరం రూపంలో. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోసం గొంతెత్తిన ఆ యువకులు తమను 'బొద్దింకలు' అని పిలిపించుకున్నారు. ఎందుకంటే అధికార వ్యవస్థ వారిని అలాగే చూస్తోందన్న ఆగ్రహం. జేఎన్‌యు విద్యార్థి సంఘం సహా పలు సంస్థలు జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టాయి. 'ప్రధాన్ రాజీనామా చేయాలి', 'ఎన్‌టిఏ రద్దు చేయాలి' అంటూ నినాదాలు హోరెత్తాయి. నీట్ పేపర్ లీక్, సిబిఎస్ఇ అల్లకల్లోలం, కామన్ యూనివర్శిటీ ఎంట్రన్స్ టెస్ట్ వైఫల్యం.. ఇవన్నీ కలిసి యువత మనసులోని నైరాశ్యానికి మంటలు పోశాయి. ఒక్కో పరీక్ష వ్యవస్థ విఫలమైన తీరు చూస్తే.. ఇది కేవలం పాలనా లోపమే కాదు, లక్షల కలలపై జరిగిన దాడి.

'కష్టపడి చదువుకుని అర్హత నిరూపించుకుంటే జీవితంలో స్థిరపడతావన్న' వాగ్దానాన్ని పరీక్ష వ్యవస్థ స్వయంగా ఉల్లంఘించినప్పుడు.. ప్రశ్నపత్రాలు అమ్ముడు పోయినప్పుడు.. శ్రమించిన విద్యార్థులకు అన్యాయం జరిగినప్పుడు –ఆ నిరాశ వ్యక్తిగతం కాదు, వ్యవస్థాపరమైన ద్రోహమవుతుంది. ఇందుకే 'కాక్రోచ్'లు రాజకీయ నినాదంగా కాదు, ప్రతీకాత్మక తిరుగుబాటుగా కనిపిస్తున్నాయి.

నీట్ ప్రశ్నపత్రం లీకైందన్న ఆరోపణలు వచ్చాయి. రూ.32 లక్షలనుంచి రూ.40 లక్షలకు అమ్ముడుపోయిందన్న మాటలూ వినిపించాయి. యుజిసి–నెట్ అక్రమాలపై ప్రోబ్‌ను సిబిఐకి అప్పగించి, ఎన్‌టిఏ డైరెక్టర్ జనరల్ సుబోధ్ సింగ్‌ను బదిలీ చేసినా సమస్య మూలాలకు పరిష్కారం దొరకలేదు. పార్లమెంట్లోనూ వివాదం మార్మోగింది. ఇది కేవలం నేరం మాత్రమే కాదు.. పేద, మధ్యతరగతి విద్యార్థులకు జరిగిన ఆర్థిక అన్యాయం. డబ్బున్న వారు ప్రశ్నపత్రం కొనగలిగారు, లేనివారు నిద్రలేచి పగలు రాత్రీ చదివారు. చివరకు న్యాయం దక్కింది ఎవరికో తెలిసిందే. పోటీ పరీక్షల ద్వారా సమాన అవకాశం కల్పించాలన్న రాజ్యాంగ స్ఫూర్తిని వ్యవస్థ సంపూర్ణంగా వమ్ము చేసింది. నీట్ వైఫల్యం తర్వాత యుజిసి–నెట్ రద్దు, సిఎస్ఎస్ పరీక్ష అవకతవకలు వరుసగా పరీక్షా వ్యవస్థలు కుప్పకూలుతున్నా మంత్రిత్వశాఖ మాత్రం అప్రమత్తత చూపలేదు. విద్యావ్యవస్థ వైఫల్యానికి తోడు, ఆర్థిక వ్యవస్థా యువతకు న్యాయం చేయడంలో వెనుకబడింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) మరియు హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ విడుదల చేసిన 'ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్ట్ 2024' ప్రకారం నిరుద్యోగుల్లో 83 శాతం యువతే. ఉద్యోగాలు లేనివారి శాతం 2000లో 35.2 నుండి 2022 నాటికి 65.7కు పెరిగింది. గణాంకాలు పైకి పెరుగుతున్నా, సాధారణ యువత చేతికి ఉద్యోగాలు అందడం లేదు. 'జాబ్‌లెస్ గ్రోత్' అనే పదం ఆర్థికవేత్తల చర్చల్లోనే కాదు, రోడ్లపై నిరసన తెలుపుతున్న లక్షల యువతీ యువకుల జీవితానుభవమైంది. ఈ పరిస్థితికి కారణం ఒక్కటి కాదు. విద్యా సంస్థలు నేర్పిస్తున్న నైపుణ్యాలకూ మార్కెట్ కోరుకుంటున్న నైపుణ్యాలకూ మధ్య విస్తరిస్తున్న అగాధం; సాంకేతిక మార్పులకు తగిన విధాన నిర్ణయాలు లేకపోవడం; జీడీపీ వృద్ధిని మానవ వనరుల వికాసంతో ముడిపెట్టే దీర్ఘకాలిక దృష్టి కోణం అందుబాటులో లేకపోవడం –ఇవన్నీ సంక్షోభ కారణాలే!

ఇందుకు పరిష్కారం కేవలం పరీక్ష వ్యవస్థ సంస్కరణతో ఆగదు. ఉన్నత విద్యా సంస్థలు పాఠ్యప్రణాళికలను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా మార్చుకోవాలి. కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, మ్యానుఫాక్చరింగ్ టెక్నాలజీవంటి రంగాల్లో నిపుణులను తయారు చేయగలిగే వ్యవస్థ రావాలి. యువత చేతికి వస్తోన్న డిగ్రీ సర్టిఫికెట్‌కు మార్కెట్లో విలువుండాలి. అదే సమయంలో ఎంఎస్‌ఎంఈల ప్రోత్సాహం, వ్యవసాయ ఆధారిత ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు విస్తరణతో మాత్రమే 'జాబ్‌లెస్ గ్రోత్' సమస్యను అధిగమించగలం. మరో కోణంలో చూస్తే భారత్ జనాభా పరంగా ఒక అనుకూలతను కలిగి ఉంది. ప్రపంచంలోనే అత్యధిక యువజనాభా ఉన్న దేశం మనది. ఈ జనాభాను 'డెమోగ్రాఫిక్ డివిడెండ్'గా మార్చుకునే అవకాశం మనకు ఉంది. కానీ అది స్వయంగా జరగదు. దానికి మెరుగైన విద్య, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన విధానాలు అవసరం. ఈ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే –అదే 'డెమోగ్రాఫిక్ డిజాస్టర్'గా మారే ప్రమాదమూ ఉంటుంది.

ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రభుత్వాలకు ప్రజలు సహనశీలంగా అవకాశమిస్తారు. కానీ దానికీ హద్దుంటుంది. 'బొద్దింకలు' అని పిలిపించుకున్న యువతరం అన్నది ఒక్కటే –మా గురించీ ఆలోచించండి, మా గళానికి విలువివ్వండి. విద్యావ్యవస్థ పతనానికి నైతిక బాధ్యత స్వీకరించడం సమస్యను పరిష్కరించదు, కానీ జవాబుదారీతనాన్ని స్థాపిస్తుంది. ఆ జవాబుదారీతనం లేకుంటే పొరపాట్లు పునరావృతమవుతాయి. ఏ ప్రభుత్వమైనా వైఫల్యాల అంగీకారానికి అడుగు వేయడమే పరిపక్వత. లేదంటే, ప్రజా విశ్వాసం అసాధ్యం. ఇప్పటికే ఆలస్యమైంది. అది పెరగకముందే స్పష్టమైన చర్యలు చేపట్టాలి. ధర్మేంద్ర ప్రధాన్ స్వచ్ఛంద రాజీనామానో, లేదా ప్రభుత్వం తొలగించడమో జరగాలి. ఇది రాజకీయ ఒత్తిడికి తలొగ్గడం కాదు.. నైతిక పాలనకు కనీస బాట. రెండొవది –నీట్ నిర్వహణలో జరిగిన అక్రమాలను నిష్పాక్షికంగా దర్యాప్తు చేసి, బాధ్యులను శిక్షించడం. మూడవది –పరీక్షా వ్యవస్థ సమూల సంస్కరణ, పారదర్శకత, జవాబుదారీతనం నిర్మాణం. నాల్గవది –నిరుద్యోగ సమస్యపై దీర్ఘకాలిక జాతీయ కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం. ప్రభుత్వం గణాంకాల సంబురాలు ఆపి, వీధుల్లో మోగుతున్న నిరాశ గొంతుకలను వినాలి. యువతకు కావలసింది ప్రసంగాలు కాదు –చదువుకున్నందుకు తగిన ఉద్యోగం, పరీక్షలు నిర్వహించినందుకు తగిన న్యాయం. అది అందించలేని వ్యవస్థ –ఆర్థికంగా ఎంత ఎదిగినా తన పునాది తానే తొలుచుకున్నట్టు. 'బొద్దింకల' ఆగ్రహం ఒక హెచ్చరిక. ప్రభుత్వం స్పందించకపోతే, ఆ నిరాశ ఇంకా పెద్ద రూపం దాల్చే ప్రమాదం లేకపోలేదు.. ఒక దేశం యొక్క నిజమైన బలం దాని జీడీపీ పరిమాణంలో కాదు –అందులో నివసించే ప్రతి యువకుడికి కలలు కనే అవకాశం ఉందా? ఆ కలలు నిజమయ్యే వ్యవస్థ ఉందా? అనేదానిలో ఉంది. ఆ దిశగా ప్రభుత్వం నడవాలి. లేదంటే చరిత్ర క్షమించదు!



# పడటం అంటే.. లేవడానికి ఓ ఛాన్స్!

జీవితంలో ఒక్కసారైనా "ఇక అంతే, నా వల్ల కాదు" అనిపించిందా? అలాంటి క్షణంలో మీరు ఒంటరి కాదు. 26 ఏళ్ల శౌర్యశిఖర్ కూడా అదే అగాధంలో నిలబడ్డాడు ఒకప్పుడు. కానీ ఆ అగాధమే అతడికి అద్భుతమైన జీవితానికి ఆరంభ బిందువైంది. అందుకే ఈ కథను వేలాది హృదయాలను తాకింది. కొన్నేళ్ల క్రితం శౌర్య జీవితంలో నిరాశ. దేశంలోనే అత్యంత కఠినమైన పరీక్ష ఐఐటీ–జేఈఈలో క్వాలిఫై కాలేదు. శౌర్యకు ఇంకో సమస్య ఉంది. అతని తండ్రి స్వయంగా ఐఐటీ పూర్వ విద్యార్థి! ఆ నేపథ్యంలో ఈ అపజయం అతడిని మానసికంగా కుంగదీసింది. తనపై తనకే నమ్మకం సడలిపోయింది. తప్పని పరిస్థితుల్లో బీబీఏలో చేరాడు. నిర్ణయం నచ్చలేదు. కాలేజీ వాతావరణం నచ్చలేదు. మానసిక ఒత్తిడి శరీరాన్ని 110 కిలోలకు చేర్చింది. తల్లిదండ్రులను నిరాశపరిచానన్న అపరాధభావన కుంగదీసింది. భవిష్యత్తుపై ఆశపడటానికే భయమేసింది.

కానీ చీకటి శాశ్వతం కాదు. కష్టకాలంలోనే శౌర్య జీవితంలో మలుపొచ్చింది. కాలేజీలో చదువుతూనే.. ప్రముఖ పారిశ్రామికవేత్త, కంటెంట్ క్రియేటర్ అంకుర్ వారికూ టీమ్‌లో చేరాడు. అదే అతడి జీవితాన్ని మార్చేసింది.

ఐదేళ్లలో అద్భుత పరివర్తన..

అదే శౌర్య ఈ రోజు ఎక్కడున్నాడో తెలుసా? 26 ఏళ్ల వయసులోనే ప్రతి నెలా లక్షల్లో సంపాదిస్తున్నాడు. ఇటీవల తన తండ్రి రిటైర్మెంట్ సందర్భంగా రూ.55 లక్షల విలువైన లగ్జరీ కారును బహుమతిచ్చాడు. విశేషమేంటంటే ఆ కారుకు కట్టిన డౌన్‌పేమెంట్ అతడి మొత్తం ఆస్తిలో కేవలం 5 శాతంకంటే తక్కువ. ఇది సంపదను కాదు, సంపూర్ణ పరివర్తనను చూపిస్తోంది. డబ్బు మాత్రమే కాదు, శౌర్య తన ఆరోగ్యాన్నీ నిర్మించుకున్నాడు. శరీరాన్ని ఫిట్‌నెస్‌తో తీర్చిదిద్దుకున్నాడు. జీవితంలో అత్యంత ఫిట్‌గా ఉన్నానని స్వయంగా చెప్పుకుంటున్నాడు.

ఈ కథను చదివినప్పుడు మనసులో మెదిలే ప్రశ్న ఒకటే, శౌర్యకు ఏది దారి చూపించింది? అంకుర్ వారికూ దానికి సమాధానం చాలా సూటిగా చెప్పారు. "జీవితం బాగుపడుతుందని నమ్మితే, మనం చేయగలిగిన ఒకే ఒక్క పని ప్రయత్నాన్ని ఆపకుండా ముందుకు నడవడమే. శౌర్య అలా నడిచాడు, అతడి జీవితం అద్భుతంగా మారింది."

కీప్ మూవింగ్. అదే ఆ రహస్యం! పడిపోయినపుడు అక్కడే ఉండిపోకుండా ముందుకు నడవడం. ఓటమి బాధలో మునిగిపోకుండా పాఠం నేర్చుకుని లేచి నిలబడటం. ఈ కథ సోషల్ మీడియాలో లక్షలాది మందిని కదిలించింది. కామెంట్లలో అనేకమంది తమ జీవితానుభవాలను పంచుకున్నారు. "విజయం సాధించిన ప్రతి ఒక్కరి జీవితంలోనూ అంతా గందరగోళంగా ఉన్న ఒక అధ్యాయం కచ్చితంగా ఉంటుంది. తేడా అల్లా ఆ అధ్యాయం చదివి పుస్తకాన్ని మూసేయలేదు, కథను ముందుకు నడిపించారు" అన్న మాటలు అందరి మనసులను తాకాయి. మరో నెటిజన్ చాలా లోతైన మాట అన్నారు. "ఈ రోజున్న పరిస్థితులే శాశ్వతమని నమ్మడమే చాలామంది చేసే అతిపెద్ద తప్పు. నమ్మకం ముగిసిపోయిన చాలా కాలానికి విజయం అందుతుంది". శౌర్య శిఖర్ కథ ఒక విజయగాథ మాత్రమే కాదు, ఒక అద్దం. ఆ అద్దంలో మన జీవితంలోని అపజయాలు, నిరాశలు, తిరిగిలేచిన క్షణాలన్నీ కనిపిస్తాయి. ఐఐటీ సీటు రాకపోవడం అతడి జీవితాన్ని ముగించలేదు, వేరే దారి వేసింది. ఆ దారిలో నడవడానికి అతడు సిద్ధపడ్డాడు, అదే నిజమైన పట్టుదల. మీ జీవితంలోనూ తలుపు మూసుకుంటే, అది వేరే తలుపు తెరవడానికి సంకేతం. ముందుకు నడవండి. అదే జీవితం ఇచ్చే శాశ్వత సూత్రం!

# భారత్‌తో దోస్తీ.. చైనాకు స్వస్తి!

మయన్మార్ అధ్యక్షుడు మిన్ ఆంగ్ హ్లైంగ్ చైనా వదలి భారత్‌కు రావడం యాదృచ్ఛికం కాదు, లెక్కకట్టిన నిర్ణయం! హ్లైంగ్ తన తొలి విదేశీ పర్యటనకు న్యూఢిల్లీని ఎంచుకున్న వేళ.. బోధ్ గయా నేలపై మోకరిల్లి ప్రార్థన చేస్తున్న దృశ్యం వెనుక, ఒక చిన్న దేశం తన సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు పడుతున్న నిశ్శబ్ద పోరాటం కనిపిస్తోంది. ఉత్తర షాన్ స్టేట్‌లో చైనా కంచెలు మయన్మార్ భూభాగంలోకి దూసుకొస్తున్నాయి. అక్కడి రైతుల పొలాలు రెండుగా చీలిపోతున్నాయి. వంశపారంపర్య భూములు మింగివేయబడుతున్నాయి. నోరెత్తితే ప్రాణాంతకం కనుక నిరసన గొంతులు నొక్కివేయబడుతున్నాయి. డబ్బు ఇస్తుంది, మౌలిక సదుపాయాలు నిర్మిస్తుంది. కానీ పొరుగుదేశాన్ని నమ్మకంగా చూడలేని బీజింగ్ నుంచి, నాగరికతా బంధం పేరిట చేయిచాచిన న్యూఢిల్లీవైపు మయన్మార్ మొగ్గు చూపడం .. ఇప్పుడు భారత్ ముందున్న అవకాశమెంత విలువైనదో చెప్పకనే చెబుతోంది!




మయన్మార్ అధ్యక్షుడు మిన్ ఆంగ్ హ్లైంగ్ తన తొలి విదేశీ పర్యటనకు చైనాను కాదని భారత్‌ను ఎంచుకోవడం సాధారణ దౌత్యచర్య కాదు, వ్యూహాత్మక సంకేతం. మోదీ ఆహ్వానం మేరకు మే 30 నుంచి జూన్ 3 వరకు జరిగిన నాలుగు రోజుల పర్యటనలో.. న్యూఢిల్లీలో ప్రధాని మోదీతో చర్చలు, వ్యాపార సమావేశాలు, ముంబై పర్యటన, బోధ్ గయా యాత్ర అన్ని కార్యక్రమాలూ పొరుగుదేశంతో బహుపొరల సంబంధాన్ని ప్రతిబింబిస్తున్నాయి. పాశ్చాత్య ప్రభుత్వాలు మరియు మానవహక్కుల సంస్థలు తిరస్కరించిన ఎన్నికల్లో అధ్యక్షుడయ్యాక మిన్ ఆంగ్ హ్లైంగ్ చేసిన ఇది తొలి అంతర్జాతీయ పర్యటన. మయన్మార్ పరిస్థితి సంక్లిష్టంగా ఉన్న తరుణంలో, ఆ దేశాధినేత చైనా వదలి భారత్‌వైపు చేయి చాచడం.. రెండు దేశాలమధ్య చారిత్రిక, సాంస్కృతిక, భూభాగ బంధం ఎంత లోతుగా పాతుకుపోయిందో చెప్పకనే చెబుతోంది. పర్యటన ప్రారంభంలోనే బోధ్ గయాలోని మహాబోధి ఆలయాన్ని సందర్శించి, బోధివృక్షం కింద ధ్యానం చేసిన హ్లైంగ్.. బౌద్ధ నాగరికతా సూత్రాన్ని ముందుకు తెచ్చారు. ఈ ఒక్క సంకేతంలోనే భారత్‌కు ఉన్న సహజ ప్రాధాన్యత కనిపిస్తుంది. అది డాలర్లతో కొనలేనిది, చైనా ఎన్నటికీ ఇవ్వలేనిది.

చైనా మయన్మార్‌పై ఆర్థిక, దౌత్య పలుకుబడి అపారంగా ఉందన్నది నిజమే. మౌలిక సదుపాయాల నిర్మాణంలో పెట్టుబడులు, సరిహద్దు దగ్గర సాయుధ గ్రూపులపై ఆధిపత్యం, అంతర్జాతీయ వేదికల్లో దౌత్య రక్షణ.. ఇవన్నీ చైనాకున్నాయి. కానీ ప్రభావం అంటే నమ్మకం కాదు. ఉత్తర షాన్ స్టేట్‌లో మయన్మార్ భూభాగంలోకి చైనా సరిహద్దు కంచెను విస్తరిస్తోందని, మయన్మార్ నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ ఆర్మీ (ఎంఎన్‌డిఏఏ) మరియు యునైటెడ్ వా స్టేట్ ఆర్మీ (యుడబ్ల్యుఎస్ఏ) నియంత్రిత ప్రాంతాల్లో ఈ నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వార్తలు కప్పిపుచ్చేందుకు మయన్మార్ జుంటా ప్రభుత్వం స్థానిక మీడియా సంస్థలను పిలిపించి, చైనాకు సంబంధించిన వార్తలపై జాగ్రత్తగా వ్యవహరించాలని హెచ్చరించింది. 2025 డిసెంబర్ నుండి, రూయిలీ నగరం నుండి మాంగ్‌షి వరకు వివిధ ప్రాంతాల్లో సరిహద్దు కంచె నిర్మాణం జరుగుతోందని స్థానిక పౌర సమాజ సంస్థలు నివేదిస్తున్నాయి. పొలాలు రెండుగా చీలిపోతున్నాయి. వంశపారంపర్య భూములు నిశ్శబ్దంగా మింగివేయబడుతున్నాయి. నోరు తెరిచి నిరసించే ధైర్యంలేని సందర్భంలో, మయన్మార్ ప్రభుత్వం భారత్ వైపు చూడడం వ్యూహాత్మక నిర్ణయం. ఎందుకంటే భారత్ మయన్మార్ సార్వభౌమత్వాన్ని సవాలు చేయడం లేదు, దాని జాతి భూగోళాన్ని తన ప్రయోజనాల కోసం వాడుకోవడం లేదు.

భారత్–మయన్మార్ ద్వైపాక్షిక వ్యాపారం 2025–26లో 1.95 బిలియన్ డాలర్లకు చేరింది. సైబర్‌క్రైమ్, మానవ అక్రమ రవాణాపై సహకారం కూడా చర్చలో ప్రముఖంగా నిలిచింది. గత 18 నెలల్లో 2,400మంది భారత పౌరులను అక్రమ స్కామ్ కేంద్రాల నుండి రక్షించేందుకు రెండు దేశాలు కలిసి పనిచేశాయి. కలదాన్ మల్టీ–మోడల్ ట్రాన్సిట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్టు మరియు ఇండియా–మయన్మార్–థాయిలాండ్ ట్రైలాటరల్ హైవే ప్రస్తుతం పలు అడ్డంకుల మధ్య ఉన్నాయని నిపుణులు చెప్పినా, ఈ పర్యటన ఆ ప్రాజెక్టులపై రాజకీయ స్పష్టతనిచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. భారత్ తన ఈశాన్య రాష్ట్రాలను ఆగ్నేయాసియాతో అనుసంధానించాలంటే.. ఒక స్థిరమైన, సహకారోన్ముఖ మయన్మార్ అత్యావశ్యకం. మయన్మార్‌తో 1,643 కిలోమీటర్ల సరిహద్దు పంచుకుంటున్న భారత్‌కు, ఆ దేశ అస్థిరత అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాంగుండా నేరుగా తన అంతర్గత భద్రతను ప్రభావితం చేస్తుంది. శరణార్థుల రాక, అక్రమ ఆయుధాల ప్రవాహం, అంతర్రాష్ట్ర తీవ్రవాద కదలికలు.. ఇవన్నీ మయన్మార్ పరిస్థితిపై నేరుగా ఆధారపడి ఉన్నాయి.

మిన్ ఆంగ్ హ్లైంగ్ భారత్ పర్యటన మయన్మార్‌కు ఒక వ్యూహాత్మక సమతుల్య ప్రయత్నం. చైనాపై అతిగా ఆధారపడకుండా ఉండేందుకు భారత్‌ను బ్యాలెన్సింగ్ పాయింట్‌గా వాడుకోవాలన్న ఆలోచన నెప్యీడాలో స్పష్టంగా కనిపిస్తోంది. ఇది భారత్‌కు ఒక మహత్తరమైన అవకాశం. కానీ ఆ అవకాశంతోపాటు బాధ్యత కూడా వస్తుంది. భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాకు చెప్పినట్టు –భారత్ విధానం మయన్మార్ అంతర్గత రాజకీయాలపై వ్యాఖ్యానించడం కాదు, నిరంతర సంప్రదింపుల ద్వారా సంబంధాలు నిలబెట్టుకోవడమే. ఇది వ్యావహారికమైన వైఖరి. మయన్మార్‌లో ప్రజాస్వామిక వ్యవస్థ, పౌర సమాజం, జాతి సంస్థలతో సంబంధాలు కొనసాగిస్తూనే, నెప్యీడావుతో వ్యూహాత్మక సహకారం సాగించాలి. భారత్ ఒక విశ్వసనీయ పొరుగుదేశంగా, అవకాశవాద శక్తిగా కాకుండా నిలవాలి. మయన్మార్ ప్రజలకు అభివృద్ధి, కనెక్టివిటీ, ఆరోగ్యం, విద్య రూపంలో తోడ్పడటమే భారత్ నిజమైన శక్తి. చైనా డాలర్లతో కొనగలదేమో కానీ నమ్మకాన్ని కొనలేదు. అది భారత్ సహజ బలం. ఈ అవకాశాన్ని భారత్ సద్వినియోగం చేసుకుంటే, ఈశాన్య భారతానికి ముందడుగు, ఆగ్నేయాసియాలో నిలకడైన స్థానం, మరియు చైనా ఏకపక్ష ఆధిపత్యానికి ప్రత్యామ్నాయం –మూడూ ఒకేసారి సాధ్యమవుతాయి! ■




పడిన చోట లేవడం నేర్చినవాడే నిజమైన యోధుడు. కమ్ముకున్న నిరాశలో ఆశను వెలిగించడమే జీవన కళ. తుఫాను తర్వాత నేల సారవంతమైనట్టే.. కష్టాల తర్వాత మనిషి పరిపక్వమవుతాడు. ఓటమిని గురువుగా.. విజయాన్ని గమ్యంగా నిర్ణయించుకుంటే -జీవితం దారి చూపడం ఖాయం. అందుకే -జీవితంలో చైతన్యం ఓటమితోనే మొదలవుతుందని పెద్దలంటారు. దాన్ని గుర్తించగల శక్తి అందరిలోనూ ఉంటుంది. ఆ అవకాశాన్ని సరైన సమయంలో అందిపుచ్చుకోవడానికి అప్రమత్తంగా ఉన్నవాడే 'అర్జునుడు' అవుతాడు.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# కొత్తొక వింత.. !




పెంపుడు జంతువు మనసు తెలుసుకోవాలని అనిపిస్తోందా? చైనాకు చెందిన హాంగ్‌జౌ స్టార్టప్ కంపెనీ "మెంగ్ జియోయి" పరిష్కారం చూపిస్తానంటోంది! తమ ఏఐ పెట్ ట్రాన్స్‌లేటర్ పిల్లులు, కుక్కల అరుపులను 95 శాతం కచ్చితత్వంతో అర్థం చేసుకుంటుందని ప్రకటించింది. పరికరాన్ని మెడలో ధరించడం ద్వారా జంతువు భావోద్వేగాలను, శబ్దాలను, ప్రవర్తనా సంకేతాలను గుర్తిస్తుందని, ఇప్పటికే 10,000 పైగా ప్రీ–ఆర్డర్లు నమోదయ్యాయని కంపెనీ పేర్కొంది. అయితే నాణేనికి మరోవైపు కూడా ఉంది! కచ్చితత్వం నిరూపించే డేటా ఎక్కడా లేదని, కేవలం క్యూట్ వీడియోలు మాత్రమే విడుదల చేశారని విమర్శకులు అంటున్నారు. పైగా ఈ కంపెనీ ఈ సంవత్సరం జనవరిలోనే స్థాపించబడిందని తెలియడంతో సందేహాలు మరింత పెరిగాయి. చైనా సోషల్ మీడియాలో దీన్ని "హ్యూమన్ ఇంటెలిజెన్స్ టెస్ట్" అని హేళన చేస్తున్నారు.

# టీమిండియాకు షాక్.. ఆఫ్గన్‌పై గెలిచినా దండగే!



అఫ్ఘానిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్టులో టీమిండియా ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ముల్లన్‌పూర్ వేదికగా జరిగిన టెస్టును టీమిండియా మూడు రోజుల్లోనే ముగించింది. ఒక ఇన్నింగ్స్ మాత్రమే ఆడిన టీమిండియా భారీ స్కోరు చేయడమే గాక అఫ్గానిస్తాన్‌ను రెండుసార్లు ఆలౌట్ చేసింది. అయితే ఆఫ్గన్‌పై భారీ విజయం సాధించినప్పటికీ వరల్డ్ టెస్టు చాంపియన్‌షిఫ్ (డబ్ల్యూటీసీ) పట్టికలో భారత్ స్థానం మాత్రం మారకపోవచ్చు. ప్రస్తుతం గిల్ సేన 48.15 పర్సంటేజ్ పాయింట్లతో ఆరో స్థానంలో కొనసాగుతుంది. మరి ఆఫ్గన్‌పై టెస్టు విజయం సాధించినా డబ్ల్యూటీసీ పట్టికలో టీమిండియా స్థానం మారకపోవడానికి కారణమేంటనేది తెలుసుకుందాం. అఫ్గానిస్తాన్‌తో టెస్టు మ్యాచ్ డబ్ల్యూటీసీ చాంపియన్‌షిప్ సైకిల్‌లో లేదు. అందుకే ఈ మ్యాచ్‌లో భారీ విజయం సాధించినా ఎలాంటి పాయింట్లు రావు. అందుకే డబ్ల్యూటీసీ పట్టికలో టీమిండియా స్థానం మారదు. 2025-27 డబ్ల్యూటీసీ సైకిల్‌లో టీమిండియా ఇప్పటివరకు ఆడిన 9 టెస్టుల్లో నాలుగింట గెలిచింది. భారత్ తన డబ్ల్యూటీసీ సైకిల్‌ను ఇంగ్లండ్ టూర్‌తో మొదలుపెట్టింది. ఇంగ్లండ్‌తో సిరీస్‌ను డ్రా చేసుకున్న టీమిండియా సౌతాఫ్రికా చేతిలో మాత్రం క్లీన్‌స్వీప్‌కు గురైంది. అయితే వెస్టిండీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసిన టీమిండియా డబ్ల్యూటీసీ పట్టికలో ఆరో స్థానంలో నిలిచింది. ఇక డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా (8 టెస్టుల్లో 7 విజయాలు) 87.50 పర్సంటైల్‌తో తొలి స్థానంలో ఉండగా, దక్షిణాఫ్రికా (75 పర్సంటైల్‌తో) రెండో స్థానంలో, శ్రీలంక (66.67 పర్సంటైల్‌తో) మూడో స్థానంలో కొనసాగుతోంది. న్యూజిలాండ్ (58.33), బంగ్లాదేశ్ (58.33) పర్సంటైల్‌తో వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో కొనసాగుతున్నాయి. ఇక ఇంగ్లండ్ (37.88) ఏడో స్థానంలో ఉండగా.. పాకిస్తాన్ (8.33), వెస్టిండీస్ (4.13) పర్సంటైల్ పాయింట్లతో చివరి రెండు స్థానాల్లో ఉన్నాయి.

## 'నన్ను రిటైర్ అవ్వమంటున్నారా?'.. భారత కెప్టెన్ అసహనం!

జూన్ 11 నుంచి ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈసారి పొట్టి ప్రపంచకప్‌కు ఇంగ్లండ్ వేదిక కానుంది. టీ20 ప్రపంచకప్‌లో పాల్గొంటున్న ఆయా జట్ల కెప్టెన్లు ప్రమోషన్ కార్యక్రమాల్లో బిజీగా గడుపుతున్నారు. ఈ నేపథ్యంలోనే టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా లండన్‌లో ఒక మీడియా కార్యక్రమంలో పాల్గొంది. ఈ సందర్భంగా ఒక రిపోర్టర్ హర్మన్‌ప్రీత్ కౌర్‌ను ఉద్దేశించి..'హర్మన్‌ప్రీత్ కౌర్.. ఇది మీకు చివరి టీ20 ప్రపంచ కప్ అవుతుందా? దీనిపై మీరేమంటారు?' అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నతో ఒక్కసారిగా అసహనానికి గురైన హర్మన్‌ప్రీత్ కౌర్.. 'ఇది నా చివరి వరల్డ్ కప్ ఎందుకు అవుతుంది? నేనేమైనా రిటైర్ అయిపోవాలని మీరు కోరుకుంటున్నారా?' అంటూ హర్మన్‌ప్రీత్ ఎదురుప్రశ్న వేశారు. దాంతో సదరు రిపోర్టర్ పరిస్థితిని సర్దుబాటు చేసేందుకు ప్రయత్నిస్తూ.. 'లేదు.. నేను కేవలం తెలుసుకోవాలని అడిగాను. ఇది మీ చివరి ప్రపంచకప్ కాదని వినడం నాకు సంతోషంగా ఉంది' అని రిపోర్టర్ చెప్పారు. అయినప్పటికీ తగ్గని హర్మన్‌ప్రీత్ కౌర్.. 'మరి అలాంటప్పుడు అసలు ఆ ప్రశ్న ఎందుకు అడుగుతున్నారు?' అంటూ నిలదీశారు. హర్మన్ మాట్లాడుతూ.. వన్డే వరల్డ్‌కప్ నెగ్గడంతో సహజంగానే మాపై అంచనాలు ఉంటాయి. భారీ అంచనాలు ఎల్లప్పుడూ ఉంటాయి. ఇలాంటి సమయంలో ఆ అంచనాలను అందుకుంటూనే ఆటపై పూర్తి ఫోకస్‌ను ఉండేలా చూసుకోవాలి. కానీ వన్డే ఫార్మాట్, టీ20 ఫార్మాట్‌లు వేర్వేరు. ఈ రెండింటికీ వ్యత్యాసం ఉంటుంది. మ్యాచ్‌ల విషయంలో ప్రజలు ఎంతో భావోద్వేగంతో ఉంటారు. వారు ఎప్పటికప్పుడు మమ్మల్ని నిశితంగా పరిశీలిస్తారు. ' అని చెప్పుకొచ్చింది. గతేడాది సొంతగడ్డపై జరిగిన వన్డే ప్రపంచకప్‌ను గెలిచిన హర్మన్‌సేనపై భారీ అంచనాలున్నాయి. జూన్ 14 నుంచి భారత్ తమ ప్రపంచకప్ ప్రయాణాన్ని ఆరంభించనుంది. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా దాయాది పాకిస్తాన్‌తో టీమిండియా తొలి మ్యాచ్ ఆడనుంది.

## స్పోర్ట్స్

### ఆఫ్ఘనిస్తాన్‌ను దెబ్బతీసిన ఇండియన్ స్పిన్నర్లు.. ఇన్నింగ్స్ 300 రన్స్ తేడాతో భారీ విజయం




**న్యూ చండీఘడ్:** భారత్‌తో జరిగిన ఏకైక టెస్టులో ఆఫ్ఘనిస్తాన్ చిత్తుగా ఓడింది. న్యూ చండీఘడ్‌లో జరిగిన మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 300 రన్స్ తేడాతో భారత్ భారీ విక్టరీ సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆఫ్ఘనిస్తాన్ కేవలం 112 పరుగులకే ఆలౌటైంది. ఇవాళ మూడవ రోజు 14 వికెట్లు పడ్డాయి. ఇండియా తన ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 564 రన్స్ చేయగా, ఆఫ్ఘనిస్తాన్ తన తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 152 రన్స్‌కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత స్పిన్నర్ మానవ్ సుతార్ ఆరు వికెట్లు తీసి ఆఫ్ఘన్ బ్యాటర్లను దెబ్బతీశాడు. అయితే రెండో ఇన్నింగ్స్‌లో ఫాలోఆన్ ఆడిన ఆఫ్ఘనీలు మరీ దారుణంగా చేతులెత్తేశారు. టాపార్డర్ బ్యాటర్ల దాదాపు విఫలం అయ్యారు. ఓపెనర్ అటల్ 42, గుర్బాజ్ 24 రన్స్ చేశారు. 412 పరుగులు వెనకబడి ఫాలోఆన్ ఆడిన ఆఫ్ఘనిస్తాన్ ఎక్కడ కూడా నిలదొక్కుకునే ప్రయత్నం చేయలేదు. స్పిన్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై భారత స్పిన్నర్లు సత్తా చాటారు. ఆఫ్ఘనిస్తాన్ కేవలం 35.3 ఓవర్లలో తన రెండో ఇన్నింగ్స్‌లో 112 రన్స్ చేసి ఆలౌటైంది. మూడో రోజు వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్ కీలక పాత్ర పోషించారు. రెండో ఇన్నింగ్స్‌లో సుందర్ 4, కుల్దీప్ మూడు వికెట్లు తీసుకున్నారు.

## రగులుతున్న కసిలో లెనిన్ లవ్.. దీంతో జోరు పెరిగేనా?






అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'లెనిన్' నుంచి 'సోల్ ఆఫ్ లెనిన్' అనే కొత్త సాంగ్ విడుదలైంది. జూన్ 26న సినిమా రిలీజ్ కాబోతున్నా ఇప్పటివరకు పెద్దగా ప్రమోషన్ల హడావుడి లేకపోవడంతో ఈ పాటతోనైనా బజ్ క్రియేట్ అవుతుందా అని అక్కినేని ఫ్యాన్స్ చూస్తున్నారు. నార్మల్ గా సినిమా విడుదలకు నెల రోజుల ముందే ప్రమోషన్ల వేగం పెంచుతారు. కానీ ఈ మూవీ టీమ్ మాత్రం చాలా లేట్ గా తమ పబ్లిసిటీని ఈ పాటతో మొదలుపెట్టింది.

లేటెస్ట్ గా వచ్చిన ఈ సాంగ్ ఒక రొటీన్ లవ్ సాంగ్ లా కాకుండా, కథలోని ఇంటెన్సిటీని హైలెట్ చేస్తోంది. నిజమైన ప్రేమలో ఉండే పెయిన్, స్ట్రగుల్స్ ను విజువల్ గా బాగానే ప్రెజెంట్ చేశారు. అఖిల్ తో పాటు హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే స్క్రీన్ ప్రెజెన్స్ ఆకట్టుకునేలా ఉంది. రగులుతున్న కసిలో ఇద్దరి ప్రేమ ఏదో ఛాలెంజ్ ను ఫేస్ చేయనున్నట్లు తెలుస్తోంది. తమన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్, వాగ్దేవి వాయిస్ ఈ ఎమోషనల్ మెలోడీకి బాగా సెట్ అయ్యాయి. కళ్యాణ్ చక్రవర్తి రాసిన లిరిక్స్ కూడా డెప్త్ తో ఉన్నాయి.కెరీర్ స్టార్ట్ చేసి పదేళ్లు కావస్తున్నా అఖిల్ కు ఇప్పటివరకు సరైన కమర్షియల్ బ్రేక్ రాలేదు. ఏజెంట్ డిజాస్టర్ తర్వాత చాలా గ్యాప్ తీసుకుని చేస్తున్న సినిమా కావడంతో లెనిన్ పై అతని కెరీర్ డిపెండ్ అయి ఉంది. మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్టైనర్ ను అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్టైన్మెంట్స్ కలిసి నిర్మిస్తున్నాయి. నాగార్జున, నాగవంశీ లాంటి పెద్ద నిర్మాతలు వెనకుండటం ఈ ప్రాజెక్ట్ కు ఉన్న మెయిన్ అడ్వాంటేజ్.మొదట్లో ఈ సినిమాను మే 1న రిలీజ్ చేయాలనుకున్నా, రామ్ చరణ్ పెద్ది సినిమాతో పోటీ వద్దని జూన్ 26కు మార్చారు. అయితే షూటింగ్ ఇంకా కొద్దిగా పెండింగ్ లో ఉండటం వల్లే ప్రమోషన్స్ ఆలస్యమయ్యాయనే ఒక టాక్ కూడా ఉంది. ప్రమోషన్ల పరంగా ఇప్పటివరకు సైలెంట్ గా ఉన్న మేకర్స్, ఇకపై నాన్ స్టాప్ గా కంటెంట్ ను వదిలితేనే బాక్సాఫీస్ దగ్గర ఆశించిన ఓపెనింగ్స్ రాబట్టడం సాధ్యమవుతుంది.ఎందుకంటే మరికొన్ని పెద్ద సినిమాలు కూడా లైన్ లో ఉన్నాయి. ఈ కాంపిటీషన్ ను తట్టుకోవాలంటే కేవలం ఒక సాంగ్ తో సరిపెట్టకుండా టీజర్లు, ట్రైలర్లు, ప్రెస్ మీట్స్ తో జనాల్లో ఇంట్రెస్ట్ క్రియేట్ చేయాలి. అఖిల్ మాస్ లుక్ తో పాటు ఈ ఎమోషనల్ కంటెంట్ ఆడియన్స్ కు ఎంతవరకు రీచ్ అవుతుందో చూడాలి. మరి ఈ కొత్త సాంగ్ ఇచ్చిన బూస్ట్ తో లెనిన్ టీమ్ ప్రమోషన్ల సౌండ్ ఎంతవరకు పెంచుతుందో తెలియాలంటే కొద్ది రోజులు ఆగాల్సిందే.



రష్మిక మందన్న అద్భుతమైన బ్లేజర్ మరియు బాడీసూట్ లుక్‌లో గ్లామ్ కోటియన్‌గా మారింది

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com